



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — PEN POWER TELUGU DAILY — ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 11 సంచిక : 306 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శనివారం 12 జూలై 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :306 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SAT 12 JULY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur

## రాష్ట్రంలో జనాభా పెరుగుదలపై ఫోకస్ పెట్టాం

- మన దేశానికి అతిపెద్ద ఆర్థిక వనరు జనాభానే అన్న చంద్రబాబు
- అమెరికాలో ఫర్టిలిటీ రేటు 1.62 శాతమేనన్న సీఎం
- జనాభా పెరుగుదలను తాను సమర్థిస్తున్నానని వ్యాఖ్య



**పెన్ పవర్ డెస్క్:**మన దేశానికి అతి పెద్ద ఆర్థిక వనరు జనాభా అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రపంచంలో జనాభా పడిపోతోందని చెప్పారు. అతి ఎక్కువ జనాభా ఉన్న దేశం భారతదేశం అని అన్నారు. మన దేశ జనాభా 143 కోట్లు కాగా... చైనా జనాభా 130 కోట్లు అని చెప్పారు. అమెరికాలో ఫర్టిలిటీ రేటు 1.62 శాతం మాత్రమేనని.... 2.1 శాతం ఫర్టిలిటీ రేటు ఉంటేనే రీప్లేస్ మెంట్ ఉంటుందని... లేకపోతే రోజురోజుకూ జనాభా తగ్గిపోతుందని తెలిపారు. మన దేశంలో బీహార్ లో ఫర్టిలిటీ రేటు 3 శాతంగా ఉందని, ఏపీలో 1.7 శాతానికి చేరుకుందని చెప్పారు. ఒకప్పుడు జనాభా ఎక్కువ ఉన్న దేశాలను చులకనగా చూసేవారని... ఇప్పుడు ఎక్కువ జనాభా ఉన్న దేశాలకు గౌరవం దక్కుతోందని చంద్రబాబు అన్నారు. గతంలో ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే... స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలు లేదనే చట్టాన్ని తాను తీసుకొచ్చానని... ఇప్పుడు జనాభా పెరుగుదలను తానే సమర్థిస్తున్నానని చెప్పారు.

రాష్ట్రంలో జనాభా పెరుగుదలపై దృష్టి సారించామని తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవ సదస్సులో ప్రసంగిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

## టీటీడీలో ఇతర మతస్తులను ఉద్యోగాల నుంచి వెంటనే తొలగించాలి



- తిరుమల శ్రీవారిని దర్శించుకున్న బండి సంజయ్
- టీటీడీలో వెయ్యి మందికి పైగా అన్యమతస్తులకు ఉద్యోగాలు ఎలా ఇచ్చారని ప్రశ్న
- వారిని ఉద్యోగాల నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్

వివరాలు 2లో..

## ఢిల్లీలో మరోసారి భూకంపం.. పరుగులు పెట్టిన జనం



**పెన్ పవర్ డెస్క్:**ఢిల్లీలో మరోసారి భూకంపం వచ్చింది. శుక్రవారం(జూలై11) ఢిల్లీ -ఎన్ సీఆర్ లో భూప్రకంపనలు సంభవించాయి. దీంతో జనం ఇండ్లలోంచి బయటికి పరుగులు పెట్టారు. భూకంప హర్యానాలోని ఝజ్జర్ కేంద్రంగా 10 కిలోమీటర్ల లోతులో సంభవించిందని నేషనల్ సెంటర్ ఆఫ్ సిస్మోలజీ (NCS) తెలిపింది. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. ఈ వారంలో ఈ ప్రాంతాన్ని తాకిన రెండవ భూకంపం ఇది. గురువారం కూడా దేశ రాజధాని ఢిల్లీలో భూకంపం జనానాలను భయభ్రాంతులకు గురి చేసింది. ఢిల్లీ, నోయిడా, ఘజియాబాద్, గురుగ్రామ్, భివానీ, ఝజ్జర్, బహదూర్‌గఢ్ సహా అనేక నగరాల్లో భూకంప ప్రకంపనలు సంభవించాయి. భూకంపం హర్యానాలోని ఝజ్జర్ కేంద్రంగా భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.1గా నమోదైనట్లు అధికారులు అంచనా వేశారు.

## మెగా పీటీఎం 2.0 గ్రాండ్ సక్సెస్ అయింది

- ఏపీ వ్యాప్తంగా నిన్న మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ 2.0
- అందరికీ కృతజ్ఞతలు తెలిపిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- ఇలాంటి కార్యక్రమాలో విద్యార్థుల భవితకు బంగారు బాట వేయొచ్చని వెల్లడి



**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన 'మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ (పీటీఎం) 2.0' కార్యక్రమం విజయవంతం అయిందని చెబుతూ రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, దాతలు, పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందని ఆయన అన్నారు.

వివరాలు 2లో..

## ట్రంప్ కొత్త బిల్లు ఎఫెక్ట్.. భారతీయ విద్యార్థులకు, టూరిస్టులకు అమెరికా షాక్!

- నాన్ ఇమ్మిగ్రేషన్ వీసాల ఫీజును పెంచిన ట్రంప్ ప్రభుత్వం
- రూ. 16 వేల నుండి రూ. 40 వేలకు పెరిగిన టూరిస్ట్ వీసా ఫీజు
- యూఎస్ వీసా ఇంటిగ్రిటీ ఫీజు కింద 250 అమెరికన్ డాలర్లు చెల్లించాలి



**పెన్ పవర్ డెస్క్:**అమెరికా వెళ్లాలనుకునే వారికి డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం షాకిచ్చింది. వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్లు యాక్ట్ కింద నాన్-ఇమిగ్రేషన్ వీసాల ఫీజును పెంచింది. ఈ ఫీజును రూ. 26 వేలకు పెంచింది. అమెరికా వెళ్లాలనుకునే భారతీయులకు కూడా ఈ ఫీజు వర్తిస్తుంది.

వివరాలు 2లో..

## నా తండ్రి నాకు ఇచ్చిన ఆస్తి ఇదే

- చదువుకు మించిన ఆస్తి లేదన్న అనిత
- తన తండ్రి తనకు ఇచ్చిన ఆస్తి చదువేనని వెల్లడి
- అమ్మను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచన



**పెన్ పవర్ డెస్క్:**సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు, తప్పుడు పోస్టులు పెట్టేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటు న్నామని ఏపీ హెూం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. సామాజిక మాధ్యమాల పట్ల పిల్లలు అప్రమ త్తంగా ఉండాలని సూచించారు. ఆడ, మగ అనే తేడా లేకుండా ఇద్దరినీ తల్లిదండ్రులు సమానంగా చూడాలని అన్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

వివరాలు 2లో..

## హిందీని గుడ్డిగా వ్యతిరేకించడం సరికాదు

### ఏపీ డిప్యూటీ సీఎం పవన్




- వ్యాపారాలకేమో హిందీ కావాలి... మరి హిందీ నేర్చుకోవడానికి ఇబ్బంది ఏంటి?: పవన్ కళ్యాణ్
- హైదరాబాదులో రాజ్య భాషా విభాగ స్వర్ణోత్సవ వేడుకలు
- హాజరైన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- హిందీ దేశ భాష అని వెల్లడి
- హిందీ నేర్చుకుంటే మరింత బలపడతామని స్పష్టీకరణ

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హిందీ భాష యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. ఐటీ రంగంలో విజయం సాధించడానికి ఆంగ్లం ఎంత ముఖ్యమో, దేశంలో ఎక్కువ మంది మాట్లాడే హిందీని నేర్చుకోవడం వల్ల కూడా అంతే ప్రయోజనం ఉంటుందని ఆయన అన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలి బాలయోగి స్టేడియంలో ఏర్పాటు చేసిన రాజ్య భాషా విభాగ స్వర్ణోత్సవ వేడుకల్లో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, దక్షిణ భారతీయ సినిమాలలో 31 శాతం హిందీ డబ్బింగ్ ద్వారానే ఆదాయం వస్తుందని గుర్తు చేశారు. వ్యాపారానికి హిందీ అవసరమైనప్పుడు, నేర్చుకోవడానికి వచ్చిన ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు.

వివరాలు 2లో..

## లిక్కర్ స్కామ్ లో వాస్తవాలు దేశం నివ్వెరపోయేలా ఉన్నాయి

- సిట్ దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయన్న పయ్యావుల
- ఐఐటీ ప్రొఫెషనల్స్ తో బాక్సులకు బాక్సుల డబ్బులు తరలించారని ఆరోపణ
- బుగ్గన బుర్రకథలు ఆపాలని హితవు



**పెన్ పవర్ డెస్క్:**ఏపీ లిక్కర్ స్కామ్ పై రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మద్యం కుంభకోణానికి సంబం ధించి సిట్ దర్యాప్తులో సంచలన విషయా లు వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు. లిక్కర్ స్కామ్ లో ఐఐటీ ప్రొఫెషనల్స్, ప్రైవేట్ వ్యక్తులను పెట్టుకుని బాక్సులకు బాక్సుల డబ్బులు తరలించారని ఆరోపిం చారు. యావత్ దేశం నివ్వెరపోయేలా లిక్కర్ స్కామ్ లో వాస్తవాలు ఉన్నాయని చెప్పారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా ఉదయ్ భాస్కర్ రెడ్డి దాదాపు 200 తప్పుడు మెయిల్స్ పెట్టాడని... ఆయనపై కేసులు పెట్టి తీరతామని అన్నారు. బంగారుపాళ్యంలో

వివరాలు 2లో..

## టీడీపీ వాళ్లేమో ఒక్కొకరిని కంటారు..

### అందరికీ ఇష్టం వచ్చినట్లు కనమని చెబుతారు




**పెన్ పవర్ డెస్క్:**జనాభా నిర్వహణ గురించి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు చేసిన కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి. గతంలో జనాభా నియంత్రణను పెద్దఎత్తున ప్రోత్సహించిన చంద్రబాబు.. ఇప్పుడు ముగ్గురికంటే ఎక్కువమంది పిల్లలను కంటేనే నిజమైన దేశభక్తి అంటూ కామెంట్ చేయడం హాట్ టాపిక్ గా మారింది. చంద్రబాబు వ్యాఖ్యలపై స్పందించిన వైసీపీ మాజీ మంత్రి పేర్ని నాని తనదైన స్టైల్ లో కౌంటర్ ఇచ్చారు. టీడీపీ వాళ్లేమో ఒకరిని కంటారు.. అందరికీ ఇష్టం వచ్చినట్లు

వివరాలు 2లో..

## ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ట్విస్ట్... విచారణకు హాజరైన రజత్ భార్గవ



**పెన్ పవర్ డెస్క్:**ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ఈరోజు కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసును విచారిస్తున్న సిట్ అధికారుల నుంచి నోటీసులు అందుకున్న నాటి ఎక్సైజ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి, మాజీ ఐఏఎస్ రజత్ భార్గవ విచారణకు హాజరయ్యారు. తనతో పాటు తన హెల్త్ కండిషన్ కు సంబంధించిన మెడికల్ సర్టిఫికెట్లను వెంట తెచ్చుకున్నారు.మరోవైపు, ఈనాటి సిట్ విచారణకు హాజరుకాలేనని ఉదయం ఆయన విచారణాధికారులకు సమాచారం పంపించారు. తన ఆరోగ్యం బాగోలేదని తెలిపారు. అయినప్పటికీ విచారణకు తప్పనిసరిగా హాజరు కావాలని సిట్ స్పష్టం చేయడంతో ఆయన విచారణకు హాజరయ్యారు. ఇప్పటికే సిట్ అధికారులు ఈ కేసులో పలువురిని విచారించి, అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

- సిట్ విచారణకు హాజరైన మాజీ ఐఏఎస్ రజత్ భార్గవ
- విచారణకు హాజరుకాలేనని ఉదయం సమాచారం పంపిన వైనం
- తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేసిన సిట్ అధికారులు

## సిద్ధరామయ్యను అవమానిస్తారా?

### రాహుల్ గాంధీపై బీజేపీ ఆగ్రహం

- ఢిల్లీకి వచ్చిన సిద్ధరామయ్యకు దొరకని రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్
- సొంత పార్టీ నేత, సీఎంను అవమానించారని బీజేపీ విమర్శలు
- గాంధీ కుటుంబం కర్ణాటక కాంగ్రెస్ నేతలను గతంలోనూ అవమానించిందని ఆరోపణ



**పెన్ పవర్ డెస్క్:**సొంత పార్టీకి చెందిన ముఖ్య మంత్రి సిద్ధరామ య్య ఢిల్లీకి వచ్చి అపాయింట్‌మెంట్ కోరితే కలవ కుండా అవమానిస్తారా? అని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. కర్ణాటకలో కొంతకాలంగా అధికార

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# జగన్ ఆ హామీ ఇస్తేనే మళ్లీ గెలుపట.. లేకుంటే క్యాడర్, లీడర్ వెనకడుగే

వైసీపీ అధినేత వైఎస్ జగన్ గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలను వెనక్కు తీసుకుంటానని ముందు చెప్పాల్సి ఉంటుంది. అప్పుడే నేతల్లో కాస్త ధైర్యం కలుగుతుంది. 2019 ఎన్నికల్లో తొలి సారి అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ తీసుకున్న అనేక నిర్ణయాలు ఆయన ఓటమికి కారణాలయ్యాయి. అందుకే గతంలో తీసుకున్న నిర్ణయాలు మళ్లీ అధికారంలోకి వస్తే అమలుచేయబోనన్నహామీ జగన్ నుంచి స్పష్టంగా రావాల్సి ఉంటుంది. అప్పటి వరకూ కార్యకర్తలు, లీడర్లు వచ్చినప్పటికీ ఇంకా రెట్టించిన ఉత్సాహంతో మాత్రం పనిచేయరు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకున్న నిర్ణయాలు పార్టీ నేతలతో పాటు కార్యకర్తలను కూడా ఐదేళ్ల పాటు ఇబ్బంది పెట్టాయి.

**కనెక్షన్ కట్ చేసి...**

ఎమ్మెల్యేలను ఉత్సవ విగ్రహాలుగా మార్చేశాడు. అసలు ఎమ్మెల్యేలకు, ప్రజలకు మధ్య సంబంధం లేకుండా జగన్ తానే ఒంటిచేత్తో రాష్ట్రాన్ని నడిపించాలన్న బిల్డప్ ఇచ్చేశాడు. బటన్ నొక్కుతున్నాను కదా? ఈవీఎంలో కూడా ఫ్యాన్ పై నొక్కుతారని భ్రమించి అడ్డగోలు నిర్ణయాలు తీసుకున్నారని ఇప్పుడువైసీపీ నేతలు కూడా అభిప్రాయపడుతున్నారు. కేవలం వారు మనసులో దాచుకోవడం లేదు. వచ్చే ఎన్నికల తర్వాత జగన్ తన తీరును మార్చుకోవాలని కూడా నేతలు సూచిస్తున్నారంటే నేతలు ఏ మాత్రం హర్ట్ అయ్యారో వేరే చెప్పాల్సిన పనిలేదు. తాజాగా నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా ఇందుకు అద్దం పడుతున్నాయి.

**వాలంటీర్ల వ్యవస్థను...**

జగన్ వాలంటీర్ల వ్యవస్థను దూరం పెట్టాలని గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కార్యకర్తల సమావేశంలో వ్యాఖ్యానించారు. తాను కూడా ఈ విషయాన్ని జగన్ కు ఎప్పుడో చెప్పానంటూ ఆయన అన్నారు. అంటే వాలంటీర్ల వ్యవస్థ పార్టీని ఎంత డ్యామేజీ చేసిందో జగన్ కు ఈ పాటికి అర్థమయి ఉండాలి. కార్యకర్తలకు పనులు అప్పజెప్పాల్సిన జగన్ వాలంటీర్లను తీసుకుని వారి నెత్తిపై పెట్టడంతో ఇటు కార్యకర్తలు, అటు ఎమ్మెల్యేల మధ్య గ్యాప్ పెరిగిపోయింది. ప్రజలకు కూడా అసలు వైసీపీ నేతలను సంప్రదించాల్సిన అవసరం లేకుండా పోయింది. దీంతో స్థానిక నాయకత్వానికి, ప్రజలకు మధ్య కనెక్షన్ కట్ అయింది. ఈ కారణంగానే గత ఎన్నికల్లో ప్రజల వద్దకు వాలంటీర్లు వెళ్లలేదు. కార్యకర్తలు వెళ్లలేదు. ఫలితంగా పదకొండు సీట్లకే పరిమితమవ్వాల్సి వచ్చింది.

**మద్యం దుకాణాల విషయంలోనూ...**

ఇక మద్యం దుకాణాల విషయంలోనూ జగన్ ది తప్పుడు నిర్ణయమేనని వైసీపీనేతలు బాహాటంగా చెబుతున్నారు. ఎప్పుడూ లేనిది చరిత్రలో తొలిసారి ప్రభుత్వం మద్యం దుకాణాలను నిర్వహించడమేంటని, ఆ దుకాణాలు ఉంటే వేలంలో తాము సాధించుకుని పదో పరకో సంపాదించుకునే అవకాశాన్ని కూడా జగన్ పోగొట్టారని ద్వితీయ శ్రేణి నేతలు కూడా అభిప్రాయపడుతున్నారు. జగన్ అధికారంలోకి రావడానికి తమ జేబు నుంచి డబ్బులు తీసి ఖర్చు పెట్టుకున్నా తర్వాత ఐదేళ్ల పాటు సంపాదించుకునే మార్గం లేక ఆర్థికంగా నష్టపోయామన్న ఆవేదన అందరిలోనూ ఉంది. అందుకే జగన్ తొలుత వాలంటీర్లు, మద్యం దుకాణాలపై తన విధానాన్ని చెప్పాలని వైసీపీ నేతలే ప్రశ్నించడం ఇప్పుడు పార్టీ నాయకత్వానికి మింగుడుపడటం లేదు.

# టీటీడీలో ఇతర మతస్తులను ఉద్యోగాల నుంచి వెంటనే తొలగించాలి

టీటీడీలో అన్యమతాలకు చెందిన ఉద్యోగులపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో వెయ్యి మందికి పైగా అన్యమతస్తులకు ఉద్యోగాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా ఆ ఆనవాయతీని ఎందుకు కొనసాగిస్తున్నారని అన్నారు. అన్యమతస్తులను వెంటనే ఉద్యోగాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. తన పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆయన తిరుమల వచ్చారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్ లో ఇప్పటికే భూమిపూజ చేసిన స్థలంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని వెంటనే నిర్మించాలని బండి సంజయ్ కోరారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలని, ప్రశాంత వాతావరణంలో జీవించాలని ఆకాంక్షించారు. సనాతనధర్మ పరిరక్షణ కోసం అందరూ కలసికట్టుగా ఉండాలని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో ధూపదీప నైవేద్యాలకు నోచుకోలేని పురాతన ఆలయాలను గుర్తించి, టీటీడీ నిధులను కేటాయించి వాటిని అభివృద్ధి చేయాలని కోరుతున్నానని అన్నారు. కొండగట్టు అంజన్న, ఇల్లందకుంట రామాలయం ఆలయాలకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు.

ఇతర మతస్తులు టీటీడీలో పనిచేస్తున్నందునే ఆచార వ్యవహారాల్లో తేడా వస్తోందని సంజయ్ అన్నారు.

స్వామిపై నమ్మకంలేని వ్యక్తులకు జీతాలిచ్చి ఎందుకు పోషిస్తున్నారని ప్రశ్నించారు. ఓటు బ్యాంకు రాజకీయాలు సరికాదని అన్నారు. బొట్టు పెట్టుకుని వెళితే మసీదులు, చర్చిల్లో ఉద్యోగాలు ఇస్తారా అని ప్రశ్నించారు.

# ట్రంప్ కొత్త బిల్లు ఎఫెక్ట్.. భారతీయ విద్యార్థులకు, టూరిస్టులకు అమెరికా షాక్!

- మొదటి పేజీ తరువాయి

అమెరికా పర్యటనకు, ఉన్నత విద్యకు, ఉద్యోగం కోసం వెళితే ఈ ఫీజును చెల్లించవలసి ఉంటుంది. టూరిస్ట్ వీసా ఫీజును రూ. 16 వేల నుంచి రూ. 40 వేలకు పెంచింది. యూఎస్ వీసా ఇంటిగ్రిటీ ఫీజు కింద 250 అమెరికన్ డాలర్లను చెల్లించవలసి ఉంటుంది. అంటే రూ. 21,400 చెల్లించాలి. ఈ మొత్తాన్ని వెనక్కి ఇవ్వరు. దీనికి అదనంగా సర్‌ఛార్జీని వసూలు చేస్తారు. వీసా జారీ చేసే సమయంలో ఈ మొత్తాన్ని చెల్లించవలసి ఉంటుంది.

బీ1, బీ2 (టూరిస్ట్ అండ్ బిజినెస్ వీసాలు), ఎఫ్ అండ్ ఎం (విద్యార్థి వీసాలు), హెచ్1బీ (వర్క్ వీసా), జే (ఎక్స్‌చేంజ్ విజిటర్ వీసా) వీసాలకు ఈ మొత్తం చెల్లించవలసి ఉంటుంది. డిప్లొమాటిక్ వీసా కలిగిన వారికి మాత్రం దీని నుంచి మినహాయింపు ఇచ్చింది. విద్యార్థులు, సాంకేతిక నిపుణులు, పర్యాటకులు, వ్యాపారం కోసం ప్రయాణాలు చేసే వారిపై ఈ ఫీజుల ప్రభావం పడనుంది. బీ2 టూరిస్ట్ వీసా ఖర్చు ప్రస్తుతం రూ. 15 వేలుగా ఉంటే, ఇప్పుడు అదనంగా ఇంటిగ్రిటీ ఫీజు కింద రూ. 21 వేలు చెల్లించవలసి ఉంటుంది. దీంతో మొత్తం ఖర్చు రూ.35 వేలు దాటుతుంది. హెచ్1బీ వీసా ధర ఇప్పటి వరకు స్వల్పంగా ఉంది. కానీ బిగ్ బ్యూటిఫుల్ బిల్లు ప్రకారం భారీగా పెరిగింది. ఇదిలా ఉండగా, వీసా ఇంటిగ్రిటీ ఫీజును కొన్ని సందర్భాలలో వెనక్కి ఇస్తారు. వీసా హోల్డర్ అమెరికాలో ఉన్న సమయంలో ఇమ్మిగ్రేషన్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తే తిరిగి ఇస్తారు. అలాగే ఐ-94 గడువు ముగియడానికి ఐదు రోజుల కంటే ముందుగా అమెరికాను విడిచి వెళ్లిన వారికి కూడా చెల్లిస్తారు. ఈ వీసా ఫీజుల పెంపు 2026 సంవత్సరం నుంచి అమలులోకి రానుంది.

# హిందీని గుడ్డిగా వ్యతిరేకించడం సరికాదు

- మొదటి పేజీ తరువాయి

తన సినిమాలో "ఏ మేరా జహా" అనే హిందీ పాట పెట్టడానికి గల కారణాన్ని వివరిస్తూ, మాతృభాష తెలుగు అయినప్పటికీ, హిందీ దేశ భాష అని చెప్పడానికే అలా చేశానని తెలిపారు.

హిందీ నేర్చుకోవడం అంటే మన ఉనికిని కోల్పోవడం కాదని, మరింత బలపడటమని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. మరో భాషను అంగీకరించడం ఓటమి కాదని, కలిసి ప్రయాణించడమని ఆయన ఉద్ఘాటించారు. విద్య, వైద్యం, వ్యాపారం, ఉపాధి వంటి రంగాలలో భాషా అవధులు చెరిగిపోతున్న ఈ సమయంలో హిందీని వ్యతిరేకించడం రాబోయే తరాల అభివృద్ధిని అడ్డుకోవడమేనని ఆయన అభిప్రాయపడ్డారు.

తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం వంటి మాతృభాషల పట్ల గౌరవం ఉండాలని చెబుతూనే, హిందీని పెద్దమ్మ భాషగా అభివర్ణించారు. ఇంట్లో మాట్లాడుకోవడానికి మాతృభాష ఉండగా, దేశ సరిహద్దులు దాటితే హిందీ రాజ్య భాషగా ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచం విడిపోవడానికి కారణాలు వెతుకుతుంటే, భారతదేశం మాత్రం ఒకే భాషతో ఏకం కావాలని చూస్తోందని, అది హిందీతో సాధ్యమవుతుందని ఆయన అన్నారు.

ఒక బెంగాలీ గీతం జాతీయ గీతమైందని, ఒక పంజాబీ దేశం కోసం పోరాడారని, రాజస్థాన్‌కు చెందిన రాణప్రతాప్ శౌర్యానికి చిహ్నంగా నిలిచారని, తమిళనాడుకు చెందిన అబ్దుల్ కలాం మిస్సైల్ మ్యాన్ అయ్యారని, మద్రాస్ ప్రెసిడెన్సీకి చెందిన వ్యక్తి రూపొందించిన మువ్వన్నెల జెండా దేశానికి తిరంగా అయిందని ఆయన గుర్తు చేశారు. ప్రతి భాషా జీవ భాష, మాతృ భాష అయినప్పటికీ, రాజ్య భాష మాత్రం హిందీయేనని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

# మెగా పీటీఎం 2.0 గ్రాండ్ సక్సెస్ అయింది

- మొదటి పేజీ తరువాయి

సమాజం స్వచ్ఛందంగా అందించిన మద్దతు విద్యా వ్యవస్థ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయం పెంచడం, విద్యార్థుల ప్రగతిని సమీక్షించడం, పాఠశాలల అభివృద్ధిలో సమాజ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వంటి లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. 'మెగా పీటీఎం 2.0' ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యా ప్రమాణాల పెంపునకు సంబంధించిన అనేక అంశాలపై చర్చించడం జరిగిందని మంత్రి వివరించారు. తల్లిదండ్రుల నుంచి వచ్చిన సూచనలు, సలహాలను స్వీకరించి, వాటిని అమలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన హామీ ఇచ్చారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని, విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని నారా లోకేశ్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నూతనోత్సాహం నింపడమే కాకుండా, వారి భవిష్యత్ నిర్మాణంలో తల్లిదండ్రుల పాత్రను మరింత క్రియాశీలం చేసిందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

# నా తండ్రి నాకు ఇచ్చిన ఆస్తి ఇదే

- మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

తాను ఒకప్పుడు టీచర్ అని చెప్పుకోవడానికి ఎంతో గర్వపడతానని అనిత అన్నారు. తన తండ్రి తనకు ఇచ్చిన ఆస్తి చదువు అని తెలిపారు. చదువుకు మించిన ఆస్తి లేదని చెప్పారు. కనిపించే దేవత అయిన అమ్మను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. తమ ప్రభుత్వంలో తల్లిదండ్రులు అందరూ చాలా సంతోషంగా ఉన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్నారని చెప్పారు. జగన్ పాలనలో గంజాయి ఏరులై పారేదని విమర్శించారు.

తమ ప్రభుత్వంలో గంజాయి కేసుల్లో పట్టుబడితే సంక్షేమ పథకాలను రద్దు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రాన్ని గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ గా మార్చుదామని పిలుపునిచ్చారు. గంజాయి మత్తులో పిల్లల జీవితాలు నాశనం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

# సిద్ధరామయ్యను అవమానిస్తారా?

- మొదటి పేజీ తరువాయి

మార్పిడిపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గురువారం ఢిల్లీకి వచ్చారు. రాహుల్ గాంధీని కలవాలని ప్రయత్నించగా ఆయనకు అపాయింట్‌మెంట్ లభించలేదు. ఈ అంశంపై బీజేపీ స్పందిస్తూ, "మీ పార్టీ నేత, ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి మిమ్మల్ని కలిసేందుకు ఢిల్లీ వరకు వస్తే ఆయనకు అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా అవమానిస్తారా?" అని బీజేపీ నేత అమిత్ మాలవీయ ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ణాటకకు చెందిన కాంగ్రెస్ నాయకులను గాంధీ కుటుంబం అవమానించడం ఇదే మొదటిసారి కాదని ఆయన ఆరోపించారు. గతంలో వీరేంద్ర పాటిల్‌ను రాజీవ్ గాంధీ అప్రజాస్వామికంగా ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించి అవమానించారని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు సిద్ధరామయ్యపై కుట్ర పన్ని డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పీఠాన్ని లాక్కోవాలని చూస్తున్నప్పటికీ, రాహుల్ గాంధీ మాత్రం ఈ విషయంపై ఆయనతో చర్చలు జరపడానికి అవకాశం ఇవ్వకుండా అవమానించారని విమర్శించారు. ఇటీవల కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీతో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సమావేశమయ్యారు. అయితే, సిద్ధరామయ్యకు రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ మాత్రం లభించకపోవడం చర్చనీయాంశంగా మారింది

# లిక్కర్ స్కామ్ లో వాస్తవాలు దేశం నివ్వెరపోయేలా ఉన్నాయి

- మొదటి పేజీ తరువాయి

జగన్ పర్యటన సందర్భంగా ట్రాక్టర్ ల నుంచి బలవంతంగా మామిడికాయలు కింద పారబోశారని మండిపడ్డారు. ట్రాక్టర్ లాక్కొచ్చి చేసిన ట్రిక్స్ డ్రోన్ కెమెరాల్లో బయటపడ్డాయని తెలిపారు. వైసీపీలో అస్తిత్వం కోసం బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని... వెటకారం తగ్గించుకోవాలని, ఇప్పటికైనా బుర్రకథలు ఆపాలని హితవు పలికారు. జగన్ రోడ్డు మీదకు వస్తే తలకాయలు కానీ, మామిడికాయలు కానీ పగలాల్సిందేనని చెప్పారు.

# టీడీపీ వాళ్లేమో ఒక్కొకరిని కంటారు.. అందరికీ ఇష్టం వచ్చినట్లు కనమని చెబుతారు

- మొదటి పేజీ తరువాయి

కనమని చెబుతారంటూ ఎద్దేవా చేశారు. టీడీపీ వాళ్ళు ముందు పిల్లల్ని కనాలని.. ఆ తర్వాత ఫ్యామిలీ ప్లానింగ్ గురించి మాట్లాడాలని అన్నారు పేర్ని నాని. రాష్ట్రంలో పోలీసులు రెడ్ బుక్ కోసం మాత్రమే పనిచేస్తున్నారని.. లా అండ్ ఆర్డర్ కోసం పనిచేయటం లేదని మండిపడ్డారు పేర్ని నాని. రాష్ట్రంలోని ఆకృత్యాలలో భాగమే కాకినాడ ఘటన అని.. కాకినాడ లైంగిక వేధింపుల ఘటన పోలీసుల పనితీరుకు అద్దం పడుతుందని అన్నారు. ఇదిలా ఉండగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హిందీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై స్పందించారు పేర్ని నాని. తెలుగు అమ్మ వంటిది, హిందీ పెద్దమ్మ వంటిది అంటూ పవన్ కళ్యాణ్ చేసిన కామెంట్స్ కి కౌంటర్ ఇచ్చారు పేర్ని నాని. పవన్ కళ్యాణ్ మోదీని తిడితే అందరూ తిట్టాలా, ఆయన హిందీ నేర్చుకోవాలంటే అందరూ నేర్చుకోవాలా, మరో పదేళ్లు చంద్రబాబును మోయాలి అంటే అందరూ మోయాలా అంటూ ప్రశ్నించారు పేర్ని నాని.

# ఒడిశాలో అమానుష ఘటన..కొత్త జంటకు తాలిబన్ తరహా శిక్షలు.. ఘోరంగా హింసించారు

పెళ్లి చేసుకోవడమే వారు చేసిన తప్పు. యువ జంట వివాహం స్థానిక ఆచారాలకు విరుద్ధం అని పాశవికంగా దాడి చేశారు. వీరి కలయిక సమాజంలో నిషిద్ధం అంటూ ఘోరమైన శిక్షలు వేశారు. అవమానించారు. ఆధునిక యుగంలోకూడా ఇలాంటి ఘటనలు కలవరం చేపుతున్నాయి. ఒడిశాలోని రాయగడ్ జిల్లాలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. అది ఒడిశాలోని రాయగడ జిల్లాలోని కంజామఝిరా గ్రామం.. ఈ గ్రామంలో ఓ యువ జంట స్థానిక ఆచారాలకు విరుద్ధంగా వివాహం చేసుకున్నారని దారుణమైన శిక్షను ఎదుర్కొన్నారు. స్వయాన అత్తకొడుకున్న పెళ్లాడిన యువతికి ఘోర అవమానం, దారుణమైన శిక్ష. అక్కడి సాంప్రదాయ నమ్మకాల ప్రకారం.. వారిది దగ్గర సంబంధంగా భావిస్తారు. వారిద్దరి కలయిక నిషిద్ధం. వివాహం చట్టబద్ధమైనప్పటికీ ఈ సంబంధం తోటి గ్రామస్తుల నుంచి తీవ్ర అభ్యంతరాలను ఎదుర్కొంది. వారు ఈ సంబంధాన్ని ఆమోదయోగ్యం కాని ఆచార ఉల్లంఘనగా భావించారు.

**ఎద్దుల్లా పొలం తున్నించారు..**


ఆచారం ప్రకారం.. వారు చేసింది తప్పు కాబట్టి శిక్ష అనుభవించాల్సిందే అని గ్రామస్థులు అవమానకరమైన దారుణమైన రీతిలో ప్రవర్తించారు. ఆ జంటను బహిరంగంగా అవమానపర్చారు. వారిని వెదురు ,చెక్క దుంగలతో తయారు చేసిన కాడికి కట్టారు. ఇది ఎద్దులు దున్నడానికి ఉపయోగించే కాడి లాంటిది. ఎద్దులా వారితో పొలం దున్నించారు. దీనికి సబంధించిన వీడియో వైరల్ అవుతోంది. వైరల్ అవుతున్న వీడియోలో ఆ యువజంట ఎద్దుల్లా నాగలి లాగుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. గ్రామస్తులు అంతా చుట్టూ చేరి వారిని హింసిస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ దృశ్యం తాలిబన్ తరహా శిక్షలను పోలి ఉందని , ఇది అమానవీయ రీతిలో ఉందని గ్రామస్తులు ప్రేక్షకుల్లా చూడడం దారుణం అని నెటిజన్లు మండిపడుతున్నారు.

**బహిరంగ అవమానం తర్వాత శుద్ధీకరణ ఆచారం..**

బలవంతంగా పొలం దున్నిన తర్వాత ఆ జంటను గ్రామ మందిరానికి తీసుకెళ్లారు. అక్కడ పెద్దలు వారిచే శుద్ధి కర్మలు చేయించారు. సామాజిక నిబంధనలను ఉల్లంఘించడం ద్వారా ఆ జంట చేసిన 'పాపం'ను శుద్ధి చేయడానికి ఈ చర్యలు తీసుకున్నాం అంటున్నారు గ్రామస్తులు. ఈ శిక్ష వారిని అవమానపరచడమే కాకుండా వారి ధిక్కార తర్వాత వారిని సమాజంలో తిరిగి చేర్చడానికి కూడా ఉద్దేశించబడినవి అని సమర్థించుకున్నారు గ్రామస్తులు.

ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహాన్ని రేకెత్తించింది. కార్యకర్తలు , పౌర సమాజ సంఘాలు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో అధికారులు దర్యాప్తు ప్రారంభించారు . ఇటువంటి అనాగరిక, చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది.

# వైభవంగా శ్రీదేవి భూదేవి సౌమ్యనాధ స్వామి కళ్యాణం



**అన్నమయ్య పెన్ పవర్ జూలై 11 :** అన్నమయ్య జిల్లా,, నందలూరులో గత ఏడు రోజులు నుండి జరుగుతున్న శ్రీ సౌమ్యనాధ స్వామి బ్రహ్మోత్సవాలు లో నేడు శుక్రవారం తిరుపతి తిరుమల దేవస్థానం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా శ్రీ శ్రీదేవి భూదేవి సౌమ్యనాధ స్వామి కళ్యాణం జరిగింది. స్వామి వారి కళ్యాణానికి అన్నమయ్య కడపజిల్లా నలుమూలల నుండి భక్తులు పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు. స్వామి వారి కల్యాణనికి తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రదినిధి మేడా విజయశేఖర్ రెడ్డి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఆలాగే శ్రీ సౌమ్యనాధ స్వామి బ్రహ్మోత్సవాలు తొమ్మిది రోజులు జరుగుతున్న సందర్భంగా బ్రహ్మోత్సవాలులో ఎలాంటి అల్లర్లు జరగకుండా పోలీసులు మరియు దేవస్థాన సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకుంటు, దేవస్థానం లో భక్తులకు తగు సౌకర్యలు నిర్వహిస్తు, ట్రాఫిక్‌ను కంట్రోల్ చేస్తు బ్రహ్మోత్సవాలని విజయపధంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి మనోజ్ రాందేవ్ హెగ్డే, రూరల్ సీఐ రమణ, నందలూరు, పుల్లంపేట, చిట్వేల్, పెనగాలూరు మండల సబ్ ఇన్స్పెక్టర్ లు... మల్లికార్జున రెడ్డి, శివ ప్రసాద్, నవీన్ బాబు, రవిప్రకాష్ రెడ్డిలు మరియు పోలీసులు, స్వామి వారి భక్తులు పాల్గొన్నారు.

పెన్ పవర్

వై.ఎస్.ఆర్. కడప

అన్నమయ్య జిల్లా

# కర్నూలు నగర అభివృద్ధికి కృషి

## - పరిశ్రమలు,వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్





**కర్నూలు , పెన్ పవర్ జూలై 11 :** కర్నూల్ నగర అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నాం అని పరిశ్రమలు,వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 45వ వార్డు అశోక్ నగర్ నందు పలు కాలనీల కు చెందిన అభివృద్ధి పనులకు మంత్రి పూజా కార్యక్రమాలు నిర్వహించి పైలాన్ ను ఆవిష్కరించారు. మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ నిధులు 75.70 లక్షలు వెచ్చించి శ్రీనగర్( రూ49 లక్షలు), అశోక్ నగర్(రూ17 లక్షలు )లలో మురుగు నీటి కాలువలు అభివృద్ధి చేయుటకు మరియు శ్రీకృష్ణ కాలనీ(రూ9.70 లక్షలు) యందు రోడ్డు ఎత్తు పెంచడానికి ఈ నిధులు వినియోగించడానికి అనుమతులు ఇచ్చామని మంత్రి తెలియజేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌ను మూడు నెలల లోపల తీసుకున్న పనులు పూర్తి చేయవలసిందిగా ఆదేశించారు.

స్థానిక ప్రజలు మురళి , ప్రసాద్ తదితరులు స్థానిక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొని రాగా సమస్యలు అన్నియు తీర్చడానికి మరియు నగర అభివృద్ధికి పూర్తిగా కట్టుబడి ఉన్నామని మంత్రి ఈ సందర్భంగా వారికి తెలియజేశారు. ఈ అభివృద్ధి పనుల పూజా కార్యక్రమంలో ఇన్చార్జ్ సూపర్డెంట్ ఇంజనీర్ శేషసాయి,డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి , డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గంగాధర్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి,45 వార్డు కార్పొరేటర్ మాణక్యమ్మ , ప్రసాద్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

# రాయదుర్గం నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యత

## - మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు



**అనంతపురం, పెన్ పవర్ జులై 11 :** ఉరవకొండ నియోజకవర్గానికి ఏ విధంగా అయితే ప్రాధాన్యత ఇస్తున్నామో రాయదుర్గం నియోజకవర్గం అభివృద్ధికి కూడా అదే విధంగా ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర ఆర్థిక & ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. రాయదుర్గం నియోజకవర్గం లోని కనేకల్ మండలం ఎర్రగుంట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక & ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ మరియు రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ రాయదుర్గం నియోజకవర్గం అభివృద్ధికి 300 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. ఉరవకొండ నియోజకవర్గానికి ఏ విధంగా అయితే ప్రాధాన్యత ఇస్తున్నామో రాయదుర్గం నియోజకవర్గం అభివృద్ధికి కూడా అదే విధంగా ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. తనకు స్థానిక ప్రాధాన్యతలు తెలుసని, కష్టమైనా కూడా మాల్యం బ్రిడ్జిని మంజూరు చేసి పనులు చేస్తున్నామన్నారు. రైతులు బాగుండాలని దాదాపు 35 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి హెచ్.ఎల్.సి కెనాల్ లో నియోజకవర్గం నుంచి పెన్నోబుళం డ్యాం వరకు అత్యవసర పనులను చేస్తున్నామని తెలిపారు. ఖజానాని ఖాళీ చేసి భయంకరమైన పరిస్థితుల్లోకి తీసుకువెళ్లారని, కేంద్ర ప్రభుత్వ సంస్థ సర్వే చేసి చెప్పింది భారతదేశంలో ఇంక అప్పులు తీసుకోలేని పరిస్థితి ఏ రాష్ట్రానికి ఉంది అంటే అది ఒకే ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాత్రమే అని తేల్చిచెప్పిందన్నారు. ప్రతి నెల ఖర్చులకు డబ్బులు సర్దుబాటు చేయడం పెద్ద సవాలుగా మారిందన్నారు. గ్రామాల్లో మహిళలు ఎలాగైతే ఖర్చుల కోసం ఇబ్బంది పడుతుంటారో అదేవిధంగా రాష్ట్రంలో తరువాయి 4లో..

# జిల్లాలో ఎక్కడ కూడా తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు

## - జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్




**చిత్తూరు, పెన్ పవర్ జూలై 11 :** జిల్లాలో జెడ్పి మరియు 15 వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా మంజూరు అనే పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని పిఆర్, ఆర్ డబ్ల్యు ఎస్ అధికారులను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరం నుండి జిల్లాలో జెడ్పి మరియు 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా చేపట్టిన పనుల పురోగతిపై ఎంపీడీవోలు ఆర్డబ్ల్యూఎస్ మరియు పంచాయతీ సెక్రెటరీ తో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 31 మండలాల్లో జడ్పీ మరియు 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి త్రాగునీరు, సిమెంట్ రోడ్స్, మురుగునీటి కాలువలకు సంబంధించిపనులనుమంజూరు చేయడం జరిగిందని, పురో గతిలో ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. నిధులు మంజూరై ప్రారంభం గాని పనులను రద్దు చేయాలని తెలిపారు.పూర్తిఅయినపనులకు సంబంధించి బిల్లులను వెంటనే అప్లోడ్ చేయాలన్నారు. మండలాలలో ప్రజా ప్రతినిధుల సూచనల మేరకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి నిధులు మంజూరు చేయడం జరిగిందని, పనులను వెంటనే ప్రారంభించిపూర్తిచేయాలని తెలిపారు. త్రాగునీరు, డ్రైన్స్ కు సంబంధించి రూ.5 లక్షల లోపు పనులను 15 రోజులలో పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీలలో గ్రామసభల ద్వారా గుర్తించి ఆమోదించిన పంపిన ప్రతిపాదనలకు నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పనుల పురోగతికి సంబంధించి జెడ్పి సీఈవో, డిపిఓలు సమన్వయం చేసుకొని పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి నెలకు ఒకసారి ఓవర్ హెడ్ ట్యాంకులను పరిశుభ్రం చేయాలని, కుళాయిల ద్వారా నాణ్యమైన తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ఇంటింటి చెత్త సేకరణ సమర్థవంతంగా చేయాలని, సేకరించిన చెత్తను ప్రాసెస్ చేయాలని ఆదేశించారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని పంచాయతీ సెక్రెటరీ, ఏఈలను సమన్వయం చేసుకొని వ్యాధులు ప్రబలకుండా ఎంపీడీవోలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రణాళిక బద్ధంగా ఓవర్ హెడ్ ట్యాంక్స్‌ను శుభ్రం చేయాలని, పంపుసెట్లు, బోర్వెల్స్ దగ్గర బహిరంగ మలమూత్ర విసర్జన జరగకుండా చర్యలు చేపట్టాలని, త్రాగునీటి పైపులల్లోకి మురుగునీరు కలవకుండా అవసరమైన చోట్ల మరమ్మత్తులు చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జడ్పీ సీఈఓ రవి కుమార్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ ఈ విజయ్ కుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్ర శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

# స్వర్ణ ఆంధ్ర కోసం -స్మార్ట్ గవర్నెన్స్ దిశగా మరో ముందడుగు

## - మంత్రి సత్య కుమార్ యాదవ్





**ధర్మవరం పెన్ పవర్ జూలై 11 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డిజిటల్ మార్పులకు చొరవ తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం, స్మార్ట్ గవర్నెన్స్ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్తోంది. ఈ దిశగా, శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం మున్సిపాలిటీలో గల సంజయ్ నగర్‌లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రిసోర్స్ పర్సన్స్ (ఆర్పీలు) కు డిజిటల్ ట్యాబ్లెపంపిణీ చేశారు. ఈ ట్యాబ్లె పంపిణీ, రాష్ట్ర ప్రభుత్వ డిజిటల్ సాధికారత పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తోంది. ఫీల్డ్ లెవల్లో పనిచేస్తున్న ఆర్పీలు ఈ ట్యాబ్లె సహాయంతో డేటా సేకరణను క్రమబద్ధీకరించగలుగుతారు. సేవల ట్రాకింగ్‌ను మెరుగుపరచగలుగుతారు. ముఖ్యంగా ఆరోగ్యం, పారిశుధ్యం, సంక్షేమ పథకాలు వంటి రంగాల్లో ప్రభుత్వ శాఖలు మరియు ప్రజల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయగలుగుతారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ టెక్నాలజీ విలాసం కాదు ం ఇది అవసరం. ఈ ట్యాబ్ మన అట్టడుగు బృందాలను ప్రజలకు వేగంగా, మెరుగ్గా మరియు మరింత పారదర్శకంగా సేవలు అందించడంలో సాధికారత కలిగించే సాధనాలు. ప్రతి సమస్యకూ రియల్ టైమ్‌లో పరిష్కారం చూపించేందుకు ఈ టెక్ టూల్స్ ఉపయోగపడతాయి. మాన్యువల్ వ్యవస్థల్లో ఉండే జాప్యాలను తగ్గించేందుకు ఇవి చక్కటి పరిష్కారంగా నిలుస్తాయి అని పేర్కొన్నారు. ఆర్పీలు ఇప్పుడు తమ రోజువారీ ఫీల్డ్ సందర్శనల్లో లబ్ధిదారుల అభిప్రాయాలను, వారి అవసరాలను డిజిటల్ రూపంలో నమోదు చేయగలుగుతారు. సమస్యల పరిష్కార స్థితిని అధికారులకు వేగంగా తెలియజేసే వీలుంటుంది. ఇది వార్డు స్థాయి నుంచి వీధి స్థాయి వరకు పారదర్శకతను, ప్రజాపాలనపై నమ్మకాన్ని పెంచేలా పనిచేస్తుంది. ఇటువంటి డిజిటల్ ప్రమాణాలు మహిళల సాధికారతకూ దోహదపడతాయి. ఈ సందర్భంగా మంత్రి గారు, ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా మహిళా ఆకాశం యాప్ ను అందుబాటులోకి తీసుకొచ్చాం. సెల్ఫ్ హెల్త్ గ్రూపుల భాగస్వామ్యంతో రాష్ట్రంలోని గ్రామాల నుంచి పట్టణాల వరకు ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవల డెలివరీకి ఇది మద్దతుగా నిలుస్తోంది, అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమం స్వర్ణ ఆంధ్రప్రదేశ్ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్తున్న స్మార్ట్ పాలనకు ప్రతీకగా నిలుస్తోంది. ప్రజల జీవితాల్లో సాంకేతికత ఆధారిత మార్పులు తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది. ప్రతి సేవా వ్యవస్థలో సమర్థత, పారదర్శకత, మరియు వేగం అనే మూల్యాలను ఆవిష్కరించేందుకు, ఇలాంటి డిజిటల్ సాధనాల వినియోగం అనివార్యమని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, టీఎంసీ లక్ష్మీనారాయణ, మెప్మా అధికారులు, పట్టణ అధ్యక్షులు చంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు సాకే ఓబ్లేష్, బిజెపి మహిళా నాయకురాలు కంచం లీలావతి, కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారి సేవలో సంస్కరణలపై టీటీడీ ఈవో సమీక్ష



**తిరుమల పెన్ పవర్ జూలై 11 :** శ్రీవారి సేవ స్వచ్ఛంద వ్యవస్థలో తీసుకురానున్న సంస్కరణలపై టీటీడీ ఈవో జే.శ్యామలరావు, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరితో కలిసి తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా త్వరలో ప్రారంభించనున్న ప్రొఫెషనల్ శ్రీవారి సేవ, ఎన్ఆర్ఐ సేవ, గ్రూప్ సూపర్వైజర్ల సేవల కార్యాచరణ పురోగతి గురించి సుదీర్ఘంగా చర్చించారు. ఐఐఎం-అహ్మదాబాద్ బృందంచే గ్రూప్ సూపర్వైజర్లకు శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందించాలని ఈఓ ఈ సందర్భంగా సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శ్రీవారి సేవను మరింత ఉన్నతంగా తీర్చి దిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా IT డిపార్ట్మెంట్ పవర్ పాయింట్ ద్వారా గ్రూప్ సూపెర్వైసర్ కొరకు రూపొందించిన అప్లికేషన్ ను చూపించారు.

అదే విధంగా ఎన్ఆర్ఐ సేవ, Professional సేవలను కూడా త్వరిత గతిన ప్రారంభించాలని, NRI సేవలను విస్తరించేందుకు APNRT సంస్థతో సంప్రదింపులు చేయాలని శ్రీవారి సేవ అధికారులను ఈఓ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ పోర్ట్ మరియు IT జీఎం శేషారెడ్డి, సీపీఆర్వో డా. టీ.రవి, అశ్వినీ ఆసుపత్రి సివిల్ సర్జన్ డాక్టర్. కుసుమ కుమారి, పిఆర్ఓ కుమారి. నీలిమ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధి, పేదరిక నిర్మూలనకు

# ప్రతి ఒక్కరు సమిష్టిగా కృషి చేయాలి

## మంత్రి ఎన్ఎండి ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి



**నంద్యాల, పెన్ పవర్ జూలై 11 :** స్వర్ణాంధ్ర-2047 విజన్ అమలులో భాగంగా నంద్యాల నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్‌లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు విశేష కృషి చేయాలని రాష్ట్ర మైనార్టీ, న్యాయ, సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర-2047 విజన్ అమలులో భాగంగా నంద్యాల నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ అమలుపై నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర మైనార్టీ, న్యాయ, సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైనారిటీ, న్యాయ, సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ మాట్లాడుతూ... స్వర్ణాంధ్ర-2047 విజన్ సాకారానికి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన సంవత్సరంలోనే అభివృద్ధి ఫలితాలు ఏ విధంగా ఉన్నాయో చూస్తున్నామన్నారు.

జిల్లా అభివృద్ధి చెందాలంటే అధికారులు, ప్రజలు ప్రజా ప్రతినిధులు భాగస్వామ్యమై గ్రామస్థాయి నుండి పట్టణ స్థాయి వరకు చేయి చేయి కలిపి పనిచేస్తే తప్పకుండా స్వర్ణాంధ్ర-2047 విజన్ సాధ్యమైతుందని తెలిపారు. నంద్యాల నియోజకవర్గంలో అవసరమైనన్ని వనరులు ఉన్నాయని వాటిని సక్రమంగా సద్వినియోగం చేసుకున్నట్లయితే తద్వారా సంపద సృష్టించి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. పేదల బతుకుల్లో వెలుగును నింపేలా పీ4 విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని పీ4 స్ఫూర్తిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి పేదలు, ధనికుల మధ్య అంతరాలు తగ్గించేలా పీ4 విధానం అమలు చేయడం జరుగుతుందన్నారు. ఆగస్టు 15వ తేదీ నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను, లక్ష మంది మార్గదర్శులను గుర్తించేలా లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళుతున్నామని ఈ లక్ష సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జిల్లాలో గుర్తించిన బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శుల ఎంపిక పూర్తి చేయాలన్నారు. పేదలకు సాయం చేయడంలో ఎంతో సంతృప్తి ఉంటుందని ఈ విజయాన్ని దృష్టిలో ఉంచుకొని మార్గదర్శకులు బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ముందుకు రావాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ జి .రాజకుమారి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047 విజన్ అమలులో భాగంగా నంద్యాల నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ విశేష కృషి చేయాలన్నారు. నంద్యాల నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి విద్యా, వ్యవసాయం, పాడిపరిశ్రమాభివృద్ధి, అలాగే వివిధ రంగాలలో అభివృద్ధి చెందిందుకు తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. నియోజకవర్గంలో రైతులు ఏ ఏ పంటలు సాగు చేస్తున్నారు. పంటలకు సంబంధించి సాగునీరు, పంట దిగుబడి తదితర అంశాలపై వ్యవసాయ శాఖ అధికారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. వ్యవసాయ శాఖ అధికారులు తమ పరిధిలో ఏ ఏ పంటలు సాగు చేస్తున్నారు. ఎన్ని హెక్టార్లలో సాగు చేస్తున్నారు. ఎంత దిగుబడి వస్తుంది అనే విషయాలు ఎప్పటికప్పుడు తెలుసుకొని ఉండాలన్నారు.

## తిరుమలలో భద్రతా ప్రణాళికలపై ఎల్&టీ సంస్థ ప్రతినిధులతో టీటీడీ ఈవో సమావేశం



**తిరుమల పెన్ పవర్ జూలై 11 :** భక్తుల సౌకర్యార్థం భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని తిరుమలలో భద్రతా ప్రణాళికలపై ఎల్&టీ సంస్థ ప్రతినిధులతో టీటీడీ ఈవో జే.శ్యామలరావు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరితో కలిసి శుక్రవారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులు టీటీడీ భద్రతా వ్యవస్థను మరింత ఆధునీకరించడంలో భాగంగా సాంకేతిక పరిజ్ఞానంతో అత్యాధునిక భద్రతా సదుపాయాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఇందులో భాగంగా అలిపిరి తనిఖీ కేంద్రం ఆధునీకరణ, అధిక సామర్థ్యం కలిగిన స్కానర్లు, త్వరితగతిన తనిఖీలు పూర్తయ్యేందుకు తీసుకోవాల్సిన చర్యలు, పార్కింగ్ మేనేజ్మెంట్, ట్రాఫిక్ కంట్రోల్, ఇంటిగ్రాటెడ్ సర్వేలన్స్ సిస్టం, కామన్ అలారం మానేజ్మెంట్ సిస్టం, ట్రాఫిక్ ఎన్ఫోర్స్మెంట్ వ్యవస్థ, నో హెల్మెట్ డిటెక్షన్, ఆటోమెటిక్ ట్రాఫిక్ కంట్రోల్ & క్లారిఫికేషన్, కమాండ్ కంట్రోల్ వ్యవస్థ వంటి అంశాలను ఈవోకు సవివరంగా వివరించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ తిరుమలలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరో 40 ఏళ్లకు సరిపడా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే రోజుల్లో తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. అదే విధంగా దీర్ఘ కాలిక, స్వల్ప కాలిక ప్రణాళికలు రూపొందించాలని L&T ప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో సీవీఎస్వో మురళీకృష్ణ, సిఈ సత్య నారాయణ, L&T ప్రతినిధుల నిపుణుల బృందం, ట్రాన్స్ పోర్ట్ మరియు IT జీఎం శేషారెడ్డి, ఏఎస్పీ రామకృష్ణ, వీజీవోలు రామ్ కుమార్, సురేంద్ర, సదా లక్ష్మీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా







**అన్నమయ్య పెన్ పవర్ జూలై 11 :** పెండింగ్లో ఉన్న 6400 ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయాలని, పీజీ విద్యార్థులకు శాపంగా మారి నటువంటి జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితిలో భాగంగా అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ఏఐఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోటేశ్వరరావు అన్నమయ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రశాంత్ మాధవ్ జిల్లా గర్ల్స్ కన్వీనర్ భవిత నాయకులు అహ్మద్, గణేష్ , సాయి కిరణ్, నవదీప్, నారాయణ, శ్రీకాంత్, తన కుమార్ నాగార్జున రాగూర్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్స్... జాతీయ రక్షణ








**అనంతపురం పెన్ పవర్ జూలై 11 :** సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ సీనియర్ సిటిజన్ల కోసం జాతీయ రక్షణ మరియు జాతీయ కార్యాచరణ సంస్థ వారిచే ప్రతిపాదన చేయబడి వృద్ధులను సంరక్షణ చేసే వారి కోసం డైరెక్టర్, హెరిటేజ్ ఫౌండేషన్ రీజినల్ రిసోర్స్ మరియు శిక్షణ సెంటర్, హైదరాబాద్ వారి సహకారంతో అనంతపురం మరియు శ్రీ సత్యసాయి జిల్లాల 8 వృద్ధాశ్రమల నిర్వహకులకు మరియు వృద్ధుల సంరక్షకులకు శిక్షణ కార్యక్రమం ఈరోజు అనగా 11-07-2025 వ తేదీన ప్రభుత్వ విభిన్న ప్రతిభావంతుల బాలికల వసతి గృహం , అనంతపురం నందు ముగిసింది. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమల నిర్వహకులు మరియు వృద్ధాశ్రమ సంరక్షకులు ఈ యొక్క సంస్థ ద్వారా తమకు ప్రస్తుతం అందిస్తున్న సేవల కంటే ఇంకా మెరుగైన సేవలు అందించేలా ఈ కార్యక్రమం తమకు ఎంతగానో ఉపయోగపడుతుందని వారు అభిప్రాయ పడ్డారు, ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని వారు కోరడం జరిగింది. అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న వృద్ధాశ్రమల నిర్వహకులు మరియు వృద్ధాశ్రమ సంరక్షకులకు జి.అర్చన , సహాయ సంచాలకులు, రవి, ప్రాజెక్ట్ డైరెక్టర్, హెరిటేజ్ ఫౌండేషన్, హైదరాబాద్ వారు ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విభిన్నప్రతిభా వంతుల సంక్షమ శాఖ సిబ్బంది, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్యమే మా కూటమి ప్రభుత్వ ధ్యేయం

### - మంత్రి సత్య కుమార్ యాదవ్



**ధర్మవరం, పెన్ పవర్ జూలై 11 :** ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ధర్మవరం నియోజకవర్గంలోని శివనగర్లో ఉన్న అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, రోగులతో నేరుగా సంభాషించి, కేంద్రంలో అందుతున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. కేంద్ర పనితీరును పరిశీలించి, వారి సేవాపరమైన అంకితభావాన్ని అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ, సంతానోత్పత్తి మరియు పునరుత్పత్తి ఆరోగ్య సంరక్షణ అంశాలపై ప్రజల్లో అవగాహన పెంపుదల అవసరమని పేర్కొన్నారు. యువతకు సరైన సమాచారం, ఆరోగ్య సంరక్షణ సదుపాయాల అందుబాటుతో వారి భవిష్యత్తు మెరుగవుతుందని నొక్కిచెప్పారు. ఈ సంవత్సరం జనాభా దినోత్సవం యుఎన్ ఇతివృత్తం ప్రకారం: న్యాయమైన మరియు ఆశాజనకమైన ప్రపంచంలో యువత కోరుకునే కుటుంబాలను సృష్టించేందుకు వారికి శక్తి కల్పించడం అనే సందేశాన్ని ప్రతిపాదించినట్లు వివరించారు. జనాభా గణాంకాల కంటే మానవ అస్తిత్వం, శ్రేయస్సు ముఖ్యమనిబీ ప్రతి యువత, మహిళ ఆరోగ్యంగా, అవకాశాలతో సుసంపన్నులై ఉండేలా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. స్వర్ణ ఆంధ్ర ఏ2047 దిశగా మేము నడుస్తున్నాం, ప్రతి ఆరోగ్య కేంద్రం ప్రజలకు సాధికారత కలిగించే వేదికగా మారాలని, ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసి, ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి గారు స్పష్టం చేశారు. స్వర్ణ ఆంధ్ర ఏ2047 లక్ష్యాన్ని చేరుకోవడంలో ఆరోగ్య శాఖ కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని, అందుకోసం సిబ్బంది అంతా నిబద్ధతతో పని చేయాలని పిలుపునిచ్చారు. జనాభా దినోత్సవం ప్రజల శ్రేయస్సుకు అంకితమైన రోజు ఈ దినోత్సవం కేవలం గణాంకాల పరిమితి కాదు, ప్రజల శ్రేయస్సు, వారి హక్కులు, ఎంపికలు, ఆరోగ్యంపై దృష్టి కేంద్రీకరించాల్సిన ప్రత్యేక రోజు అని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ చెన్న రెడ్డి, మెడికల్ ఆఫీసర్ సౌమ్య, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కమలాపురం పాలిటెక్నిక్ కళాశాలలో రక్తదాన వారోత్సవాలు



**కమలాపురం పెన్ పవర్ జూలై 11 :** కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజ్ నందు మదర్ థెరిసా సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగినది.. ముఖ్య అతిథులుగా సి.సాయిగ్రేస్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, స్టెప్, కడప,గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజ్ ప్రిన్సిపాల్ డి సత్యనారాయణ రెడ్డి మదర్ థెరిసా సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జూటూరు విజయ్ కుమార్ పాల్గొన్నారు. అతిథులు సి.సాయిగ్రేస్ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆరోగ్యకరంగా ఉండే యువత రక్తదానం చేయొచ్చు అని మరియు రక్తదానం చేయడం వల్ల పాత కణాలు పోయి కొత్త కణాలు రావడంతో ఎంతో ఆరోగ్యకరంగా ఉంటామని తెలియ జేశారు. కమలాపురం పాలిటెక్నిక్ కాలేజ్ డి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఏ ప్రయోగ శాలలోనూ తయారు అవ్వనిది రక్తం మాత్రమే అలాంటి రక్తాన్ని మనిషి మాత్రమే దానం చేయగలరని అన్నారు.. అలాగే ఒక్కరోజు రెండు రోజులు రక్తదాన శిబిరాలు నిర్వహించకుండా ఒక మంచి సంకల్పంతో "రక్తదాన వారోత్సవాల" పేరుతో వారం రోజులపాటు వరుసగా రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందదాయకమని తెలిపారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు జూటురు విజయ్ కుమార్ మాట్లాడుతూ అమ్మ జన్మనిస్తే రక్తదాత పునర్జన్మ ఇచ్చినవారు అవుతారని కొనియాడారు. ఇలాంటి పుణ్య కార్యంలో రక్తదానం చేసి పాల్గొన్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు..రక్తదానం చేయడం ద్వారా ఎన్నో ఆరోగ్య లాభాలు ఉన్నాయని ఆ లాభాలను గురించి అవగాహన కలిగి రక్తదానం చేసేందుకు యువత నడుంబిగించాలని ఈ కార్యక్రమంలో విద్యార్థులు స్వచ్ఛందంగా 25 మంది రక్తదానం చేశారు ఈ కార్యక్రమంలో రెడ్డి ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్ మధు ఉపాధ్యాయులు ట్రస్ట్ సభ్యులు ఉమేష్ చంద్ర, శ్రీకాంత్ రెడ్డి, రమేష్, కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




## రాయదుర్గం నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యత



**(3వ పేజీ తరువాయి)** వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలకు నిధులు సమకూర్చడం కూడా సమస్యగా ఉంటుందన్నారు. గత ప్రభుత్వం దివాలా తీయించినా ముఖ్యమంత్రి చంద్రబాబు చతురత, అనుభవంతో రాష్ట్రం ప్రగతి బాట పట్టిందన్నారు. రాష్ట్ర ఆదాయం పెంచే విధంగా ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. పెద్దపెద్ద కంపెనీ ద్వారా పెట్టుబడులు పెట్టించి ఉపాధి కల్పనకు ముఖ్యమంత్రి అనునిత్యం శ్రమిస్తుంటారని గుర్తు చేశారు. తద్వారా రాష్ట్ర ప్రజలకు ఉపాధితో పాటు రాష్ట్ర ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. పేదోళ్ల కష్టాలు తెలిసిన వారు కాబట్టే తాము ఎంత శ్రమ ఉన్న భుజాన వేసుకుని ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేస్తున్నా మని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు గైడెన్స్ ఇస్తున్నారు కాబట్టే కష్ట కాలంలో నిలబడగలుగుతున్నామన్నారు. గతంలో కంటే తల్లికి వందనం పథకాన్ని అధికంగా ఇస్తున్నామని, పెన్షన్లను ఒకేసారి వెయ్యి రూపాయలు పెంచామని, అన్నదాత సుఖీభవ పథకం కింద త్వరలోనే రైతులకు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. గతంలో కంటే తాము సంక్షేమాన్ని రెట్టింపు చేశామని, అభివృద్ధిని పదింతలుగా చేస్తున్నామన్నారు. ఐదేళ్లు హెచ్.ఎల్.సి పనులు చేపట్టలేదని, తాము పనులు చేపట్టామని, ఎర్రగుంట గ్రామంలో 70 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్లు వేశామన్నారు. రాష్ట్రానికి మంత్రినైనా అనంతపురం జిల్లా అభివృద్ధికి మొదటి కూలీగా పని చేస్తానన్నారు. కరువు ప్రాంతమైన మన జిల్లాలో బీదల కష్టాలను కొంచమైన తీర్చగలిగితే చాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో జిల్లా రుణం తీర్చుకునేందుకు పనిచేస్తామన్నారు. ముఖ్యంగా తన పూర్వీకుల రాజకీయ నేపథ్యం రాయదుర్గం నియోజకవర్గంతో ముడిపడిందన్నారు.

అందువల్లే ఉరవకొండతో పాటు రాయదుర్గంతో గట్టి సంబంధాలు కొనసాగుతున్నాయన్నారు. ఈ ప్రాంతం కూడా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నాన న్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మరియు రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి క్షణం ప్రజాహితమే లక్ష్యంగా చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తోంద న్నారు. ప్రజల విశ్వాసం, ఆశీస్సులతో ఎంపికైన ప్రభుత్వం పేదరికాన్ని దూరం చేయటానికి ఎంతగానో శ్రమిస్తోందన్నారు. ఐదేళ్ల దుష్టపాలన హెచ్.ఎల్.సి వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సహకారంతో హెచ్.ఎల్.సి అత్యవసర పనులకు అను మతులు లభించాయన్నారు. వారందరి చలవవల్లే గండ్లు, పైపింగ్లు పడే పరిస్థితి నుంచి బయట పడగలుగుతున్నా మన్నారు. మంత్రి పయ్యావుల కేశవ్ తో తనకున్న వ్యక్తిగత పరిచయాలతో సకాలంలో తగిన సూచనలు సలహాలు ఇస్తూ ముందుకు నడిపిస్తుంటారని పేర్కొ న్నారు. ప్రజలకు మేలు చేయాలన్న సంకల్పంతో ముఖ్య మంత్రితో పాటు పయ్యావుల అనేక నిద్రలేని రాత్రులు గడుపుతుంటారన్నారు. నిధుల సమీకరణ ప్రస్తుత పరిస్థితుల్లో పెద్ద కష్టంగా మారిందన్నారు. అయినప్ప టికీ జిల్లాను ఏదో విధంగా అభివృద్ధి పరచాలనే దృఢ లక్ష్యంతో మంత్రి నిధులు సమకూర్చగలుగుతున్నార న్నారు. ఇంత గడ్డు పరిస్థితుల్లో కూడా రూ.3800 కోట్లతో హంద్రీనీవా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అలాగే ఆగిపోయిన జీడిపల్లి బైరవాణి తిప్ప ప్రాజెక్ట్ పనులు పునః ప్రారంభించామన్నారు. ఆవులదట్ల, మాల్యం బ్రాంచ్ కాలువలకు నిధులు సమకూర్చి సకాలంలో పూర్తి చేయడానికి మంత్రి తోడ్పాటు అందించాలన్నారు. జల్ జీవన్ మిషన్ కింద ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న దశలో రాయదుర్గాన్ని కూడా ప్రతిపాదన చేయించుకొమ్మని ముందే అప్రమత్తం చేశారన్నారు. నేమకల్లు రిజర్వాయర్ తో పాటు హెచ్.ఎల్.సి ఆధునీకికరణ పనులను పూర్తి చేసుకోవడానికి మంత్రి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎర్రగుంట గ్రామంలో ఒక కోటి 72.99 లక్షల రూపాయల వేయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి, విప్ ప్రారంభిం చారు. తదనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీ లించి వసతుల కల్పన గురించి అడిగి తెలుసుకున్నారు. ఆ తరువాత గ్రామంలోని ఎన్నేరంగస్వామి ఆలయం దగ్గరలోని హెచ్.ఎల్.సి కెనాల్ లో అండర్ టన్నెల్ (యుటి) పనులను మంత్రి, విప్ పరిశీలించారు. కాలువకు త్వరలో నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో పనుల పురోగతిని పరిశీలించారు. ఇప్పటికే చాలావరకు పనులు పూర్తి చేశామని, కాలువ నీటి పంపిణీకి ఎలాంటి సమస్య ఎదురు కాదని ఇంజనీర్లు వివరించారు. ఈనెల 15 నుంచి హెచ్.ఎల్.సి, హంద్రీనీవా కాలువలకు నీటిని సరఫరా చేసుకోవడం జరుగుతోందని మంత్రి ప్రకటించారు. ఈలోగా మిగిలిన పనులను కూడా పూర్తి చేసి సక్రమ నీటి పంపిణీకి సహకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంత రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## నిషేధిత జాబితాలో 22ఏ భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి



**అనంతపురం, పెన్ పవర్ జూలై 11 :** అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం జిల్లా స్థాయి 22ఏ కమిటీ, డిఎల్సి/ డిఎల్ఎన్సి సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిషేధిత జాబితాలో ఉన్న డాటెడ్ ల్యాండ్స్ ని, 22ఏ భూములను తొలగించేందుకు, "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో వస్తున్న అర్జీలకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో 22ఏకు సంబంధించి 52 క్లెయిమ్స్ ని విచారించడం జరగగా, అందులో 15 ఆమోదించగా, 28 తిరస్క రించగా, 9 దరఖాస్తులను పునః పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ.మాలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, ఆయా మండలాల తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి పుష్పయాగానికి శాస్త్రోక్తంగా అంకురార్పణ











కర్నూలు ఎయిర్‌పోర్ట్‌లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి డా.జస్టిస్ వెంకట జ్యోతిర్మయిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించిన జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా.

# పార్టీ గుర్తులు కాదు-ప్రజల జీవితాల్లో మార్పు ముఖ్యమన్నదే మా ధ్యేయం

## - మంత్రి సత్య కుమార్ యాదవ్



**ధర్మవరం, పెన్ పవర్ జూలై 11 :** ఆత్మనిర్భర భారత లక్ష్యాన్ని ముందుంచుకుని, రాష్ట్ర వ్యాప్తంగా స్వయం ఉపాధి మరియు మహిళా సాధికారత దిశగా చేపట్టిన కీలక ప్రగతి చర్యలలో భాగంగా, ధర్మవరంలోని శ్రీ శక్తి భవన్‌లో ఉచిత టైలరింగ్ శిక్షణా కేంద్రాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వానికి అనుబంధంగా పనిచేస్తున్న ఆంధ్ర ప్రదేశ్ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ, బీసీ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అమలు అవుతోంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, ఇతర కూటమి పార్టీల నాయకులు కలిసి పాల్గొన్నారు. పార్టీబద్ధమైన రాజకీయ భిన్నతలకు అతీతంగా, మహిళల సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఈ నూతన ఆవిష్కరణకు మద్దతుగా చల్లని చేతులు కలిపారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ, వెనుకబడిన వర్గాలకు చెందిన మహిళలకు తమ స్వంత జీవితాన్ని నిర్మించుకునే నైపుణ్యాన్ని ఇచ్చే ప్రయత్నం ఇది. ఉచితంగా శిక్షణ ఇవ్వడమే కాకుండా, శిక్షణ పూర్తిచేసిన ప్రతి లబ్ధిదారుకు ఉచితంగా కుట్టుమిషన్ అందించడం ద్వారా వారికి ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇది కేవలం ఉద్యోగావకాశం కాదు–ఇది గౌరవంగా స్వశక్తిగా జీవించే దిశగా వేసిన తొలి అడుగు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా BC, EBC, కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్య, బ్రాహ్మణ మరియు కాపు (బలిజ) వర్గాల మహిళలకు పూర్తి ఉచితంగా ప్రాథమిక టైలరింగ్ శిక్షణను అందిస్తున్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తిచేసిన వారికి కుట్టు మిషన్లు అందజేయడం ద్వారా వారు తమ కుటుంబాలకు ఆర్థికంగా నిలువైన ఆదరణగా మారగలుగుతారు. ధర్మవరం నియోజకవర్గంలో మొత్తం 6 శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. వీటిలో ధర్మవరం మునిసిపాలిటీలో 4, ముదిగుబ్బ మండలంలో 2 కేంద్రాలు కొనసాగుతున్నాయి. మొత్తం 864 మంది మహిళలు ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా లబ్ధిపొందుతున్నారు. శిక్షణ వ్యవధి 45, 60, 90 రోజులు గా ఎంపిక చేసుకునే వీలుంది. కనీసం 75% బయోమెట్రిక్ హాజరు కలిగి ఉండాల్సిన అవసరం ఉంది. ఈ కేంద్రాలలో శుభ్రమైన విశ్రాంతి గదులు, తాగునీటి సదుపాయం, సరైన వెలితీ మరియు లైటింగ్ వంటి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించబడ్డాయి. అంతేగాక, శిక్షణా కార్యక్రమాన్ని ఫోటో డాక్యుమెంటేషన్,



సెషన్ లాగ్‌లు, కేంద్రాల వారీగా పురోగతి ట్రాకింగ్ ద్వారా డిజిటల్‌గా పర్యవేక్షించనున్నారు. శ్రీ సత్యసాయి జిల్లావ్యాప్తంగా చూస్తే, మొత్తం



59 ఉచిత శిక్షణా కేంద్రాలు నడుస్తు న్నాయి. ఇప్పటివరకు 17,134 దరఖాస్తులు స్వీకరించబడి, వాటిలో 4,028 దరఖాస్తులు ధృవీకరించబడ్డాయి, మొత్తం 8,097 మంది మహిళలకు లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్, చిలకం మధుసూదనరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నైపుణ్యాభివృద్ధి చర్యలు సరికొత్త సామాజిక న్యాయ శకాన్ని ప్రారంభిస్తున్నాయి. మహిళలు తమ కుటుంబాలకు బలమైన మార్గదర్శకులుగా మారాలన్న సంకల్పంతో ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నానికి మేము పూర్తి మద్దతు ఇస్తున్నాం అని వెల్లడించారు. ధర్మవరంలో మొదలైన ఈ శిక్షణ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది మహిళల జీవితాల్లో మార్పు తీసుకురావడమే కాకుండా, కూటమి నాయకులు కలసి చేసిన ప్రారంభంతో రాజకీయ ఐక్యతతో అభివృద్ధికి నాంది అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ కార్పొరేషన్ కోఆర్డినేటర్ రవి నాయక్, జానకి, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, ఎంపీడీవో సాయి మనోహర్, పట్టణ అధ్యక్షులు చంద్ర, మండలాల అధ్యక్షులు చంద్ర, రాము, భాస్కర, ఓబులేష్, టిడిపి పట్టణ అధ్యక్షులు సుధాకర్, ఏపీ సీడ్స్ డైరెక్టర్ కమతం కాటమయ్య, మహేష్ చౌదరి, ఫణి కుమార్, సంద రాఘవ, జనసేన నాయకులు రాజారెడ్డి, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు అడ్డగిరి శ్యామ్ కుమార్, డిష్ రాజు, ఎన్డీఏ కూటమి మహిళా నాయకురాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారం దిశగా సుపరిపాలన తొలి అడుగు : ఎమ్మెల్యే దగ్గుపాటి

### శ్రీనివాస్ నగర్‌లో పలు సమస్యలకు గంటల వ్యవధిలో పరిష్కారం



**అనంతపురం, పెన్ పవర్ జూలై 11 :** కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి ఆర్తీసుకెళ్లేందుకు చేపట్టిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో సమస్యల పరిష్కారం దిశగా సాగుతోంది. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కేవలం చేసిన వాటి గురించి చెప్పడమే కాకుండా స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు కూడా తెలుసుకుంటున్నారు. గతంలో మీ ఇంటికి మీ ఎమ్మెల్యే తరహాలోనే సమస్యల పరిష్కారం పై ప్రత్యేకంగా చొరవ చూపుతున్నారు. ఇందులో భాగంగా చిన్న చిన్న సమస్యలకు వెంటనే పరిష్కారం చూపుతున్నారు. తాజాగా శుక్రవారం ఉదయం శ్రీనివాస్ నగర్‌లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సమయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి దృష్టికి కొన్ని సమస్యలు తీసుకొచ్చారు. వీధి లైట్లు పడటం లేదని రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఎమ్మెల్యే దగ్గుపాటికి తెలిపారు. దీంతో వెంటనే మున్సిపల్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి వెంటనే లైట్లు వేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెళ్లిన రెండు గంటల వ్యవధిలోనే మున్సిపల్ సిబ్బంది అక్కడికి చేరుకుని కాలనీ వీధి లైట్లు అన్ని మార్చివేశారు. ఎమ్మెల్యే ఇంతవేగంగా స్పందించడంపై కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే దగ్గుపాటి దృష్టికి ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే దానికి పరిష్కారం ఉంటుందని ఈ సందర్భంగా శ్రీనివాస్ నగర్ నాయకులు పేర్కొన్నారు.

# జిల్లాలో 15,71,402 మంది ఓటర్లు

### జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు, పెన్ పవర్ జూలై 11 :** జూలై ఒకటో తేదీ నాటికి జిల్లాలో 15,71,402 మంది ఓటర్లు ఉన్నారు అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన డిఆర్ఓ కె.మోహన్ కుమార్‌తో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పారదర్శకమైన ఓటరు జాబితా తయారీ చేయడంలో భాగంగా మరణించిన వారి పేర్లను తొలగించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఎలెక్షన్ సెల్ అధికారులు సమన్వయం చేసుకుని ప్రతినియోజక వర్గంలో సచివాలయం వారీగా మరణించిన వారిని ఓటర్ల జాబితా నుండి తొలగించే ప్రక్రియ ప్రారంభించడం జరిగిందని, ప్రతి మూడు నెలలకు ఒకసారి ఓటర్ల జాబితా తయారు చేసి రాజకీయ పార్టీ నాయకులకు అందజేయడం జరుగు తుంది. అందులో మీ సలహాలు సూచనలు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. రివిజన్ 3 కింద ఏప్రిల్ 2025 నుండి జూన్ 2025 వరకు కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. 7 నియోజకవర్గంలో మరణించిన వారి సంఖ్య 874 మంది ఓటర్లను తొలగించడం జరిగింది, షిఫ్ట్ ఓటర్లు 833 గుర్తించడం జరిగింది. రిపీటెడ్ ఓటర్లు 542 ఓటర్లను గుర్తించడం జరిగింది, మొత్తం 2249 ఓటర్లను గుర్తించడం జరిగిందని తెలిపారు. ఫారం 6, ఫారం–8 కింద 3,049 నంది ఓటర్లు అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 10,615 మంది ఓటర్లకు ఎపిక్ కార్డులు పోస్టల్ ద్వారా ఓటర్లకి అందజేయడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. బిఎల్వోలుకి ప్రాపర్ గా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రతి మూడు నెలలలోకొకసారి ఓటరు జాబితా తయారీ చేయడం జరుగుతుందని తెలిపారు. టిడిపి పార్టీ ప్రతినిధి సురేంద్ర కుమార్, పోలింగ్ స్టేషన్ లను ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో కొత్తగా ఓటర్లు నమోదైన వారికి కార్డుల పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని బిజెపి పార్టీ ప్రతినిధి అట్లూరి శ్రీనివాసులు, ఒక నియోజకవర్గం నుండి మరొక నియోజకవర్గానికి ఓటర్ల జాబితాలో పేర్లను మార్పుకు సంబంధించి అంశాలను పరిశీలించాలని సిపిఎం పార్టీ ప్రతినిధి గంగరాజు జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సమావేశానికి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులైనటి వైఎస్ఆర్ సిపిఎన్.ఉదయ్ కుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి బాల సుబ్రహ్మణ్యం, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఏ పరదేశి మరియు ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ వాసుదేవన్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వైసిపి విస్తృతస్థాయి సమావేశం



**మదనపల్లి పెన్ పవర్ జూలై 11 :** మదనపల్లె నందు మదనపల్లె నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశంలో రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో గుర్తు చేస్తూ అనే కార్యక్రమంలో రాజంపేట జిల్లా అధ్యక్షులు మరియు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డితో కలిసి పాల్గొన్న కడప నగర మేయర్ మరియు రాజంపేట పార్లమెంట్ పరిశీలకులు కె.సురేష్ బాబు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సీనియర్ నాయకులు సుగవాసి సుబ్రహ్మణ్యం, ఇతర ముఖ్య వైఎస్ఆర్సిపి నాయకులు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలు,ఇతర వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామీణ యువత యువకులు తదితరులు పాల్గొని మదనపల్లి నియోజక వర్గం విస్తృతస్థాయి కార్యక్రమం విజయవంతం చేశారు.

# ధర్మవరం అభివృద్ధి మా ధ్యేయం-సేవే మా సంకల్పం

## మంత్రి సత్య కుమార్ యాదవ్



**ధర్మవరం, పెన్ పవర్ జూలై 11 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి, ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్, తన పాలనకు ఒక సంవత్సరం పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని ఈరోజు ధర్మవరం పట్టణంలో ప్రజల మధ్య పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా తిక్కస్వామి నగర్లోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజల ఆయురారోగ్యాల కోసం ప్రార్థించిన మంత్రి, 7వ వార్డు తిక్కస్వామినగర్ నుంచి పాదయాత్రను ప్రారంభించారు. ఈ పాదయాత్రలో ముక్త అతిథులుగా టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, ఇతర ఎన్డీఏ కూటమి నేతలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కూటమిగా ప్రభుత్వాన్ని నడుపుతూ, ప్రజల అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తున్న నేతల ఐక్యత ఈ కార్యక్రమంలో స్పష్టంగా కనిపించింది. 6 వార్డుల్లోని ప్రజల గడప గడపకూ వెళ్లిన మంత్రి సత్య కుమార్ యాదవ్–శివనగర్, సంజయ్ నగర్, గాంధీనగర్, ఇందిరానగర్, పిఆర్‌టి వీధిలలో–ప్రజల సమస్యలు నేరుగా విన్నారు. పెండింగ్ సమస్యలపై తక్షణమే సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

మంత్రి పాదయాత్రలో ప్రజలు పేర్కొన్న ప్రధాన సమస్యలు బీ మురికి కాలువల శుభ్రత కాలువల నిర్మాణం, పాడైపోయిన సీసీ రోడ్ల పునర్నిర్మాణం, తాగునీటి సరఫరాలో లోపాలు, పాడైపోయిన విద్యుత్ స్తంభాల మూలంగా ఏర్పడిన సమస్యలు, ముఖ్యంగా చేనేత కార్మికుల విద్యుత్ సమస్యలు, కొత్త విద్యుత్ స్తంభాల అవసరం, వితంతువుల పెన్షన్, వృద్ధాప్య, అంగవైకల్య పెన్షన్లు, ప్రధాన రహదారుల్లో కల్వర్టుల నిర్మాణం, ఆరోగ్య సేవల లోపాలు, ఈ అంశాలన్నింటిపై మంత్రి ప్రత్యక్షంగా స్పందించారు. తక్షణమే అధికారులతో మాట్లాడి, పరిష్కార మార్గాలను సూచించడంతో పాటు తన కార్యాలయ సిబ్బందిని చర్యలు పర్యవేక్షించేందుకు ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ.... ఈ ప్రభుత్వం వచ్చాక ప్రజల జీవితాల్లో మార్పు ప్రారంభమైంది. అరాచక పాలనకు తెరదించి, అభివృద్ధి – సంక్షేమాన్ని సమంగా తీసుకొస్తున్నాం. ప్రజల సమస్యలపై వెంటనే స్పందించడమే మా బాధ్యత. ధర్మవరం పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడంలో నిరంతర కృషి చేస్తాను, అని మంత్రిగారు అన్నారు. ఇప్పటివరకు 110 కోట్ల రూపాయలతో విద్యుత్ శాఖకు సంబంధించిన ప్రణాళిక ప్రభుత్వానికి సమర్పించబడింది. రూ. 9 కోట్లతో ఫైనాన్స్ కమిషన్ నిధుల ద్వారా రోడ్లు, కాలువల అభివృద్ధి పనులు ప్రారంభించబడ్డాయి. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని డీసిల్టింగ్, మురుగు నీటి కాలువల క్లీనింగ్ కార్యక్రమాలు చేపట్టబడ్డాయి. ఎక్స్‌టెండెడ్ ఏరియాల్లో విద్యుత్, రోడ్లు, కాలువలు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధమయ్యాయని పేర్కొన్నారు. అనంతరం పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో పట్టణ అభివృద్ధికి ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వలేదు. మంత్రిగారి నాయకత్వంలో మళ్లీ ప్రజల విశ్వాసం తెచ్చుకున్నాం. ప్రజల ఇంటి వద్దకే పాలనను తీసుకెళ్లిన ఈ పాదయాత్ర ఆదర్శప్రాయంగా నిలుస్తుంది అని అన్నారు. తదనంతరం చిలకం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ కూటమిగా పనిచేసే మన లక్ష్యం ఒక్కటే–ప్రజలకు మేలు. మంత్రిగారు చేసిన ఈ పాదయాత్ర ద్వారా ప్రజల మనస్సుల్లో మళ్లీ విశ్వాసం నాటబడింది. ప్రజల సమస్యలపై గంభీరంగా స్పందిస్తున్న నేతలతో రాష్ట్రానికి మంచి జరుగుతుంది, అని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చంద్ర, మండలాల అధ్యక్షులు చంద్ర, రాము, భాస్కర, ఓబులేష్, టిడిపి పట్టణ అధ్యక్షులు సుధాకర్, ఏపీ సీడ్స్ డైరెక్టర్ కమతం కాటమయ్య, మహేష్ చౌదరి, నరేంద్ర, ఫణి కుమార్, జనసేన నాయకులు రాజారెడ్డి, శ్యామ్, డిష్ రాజు, ఎన్డీఏ కూటమి మహిళా నాయకురాలు, మహిళా కార్యకర్తలు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లాలోని దేవాదాయ శాఖ భూములను పరిరక్షించాలి : డిఆర్ఓ



**చిత్తూరు, పెన్ పవర్ జూలై 11 :** జిల్లాలోని దేవాదాయ శాఖ భూములను తప్పనిసరిగా పరిరక్షించాలని డిఆర్ఓ కే.మోహన్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం డిఆర్ఓ ఛాంబర్ నందుదేవాలయ భూముల పరిరక్షణపై జిల్లాస్థాయి భూ సంరక్షణ కమిటీ సభ్యులతో డిఆర్ఓ అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ... జిల్లాలో మొత్తంగా 17540 ఎకరాల దేవాలయ భూములు ఉన్నాయన్నారు. ఈ భూములన్నింటినీ కూడా తప్పనిసరిగా సంరక్షించాలన్నారు. ఎక్కడైనా ఆక్రమణకు గురి అయి ఉంటే వెంటనే గుర్తించి వాటిని తొలగించాలని ఆదేశించారు. జిల్లాలో ఆక్రమణ లో గుర్తించిన 1343.17 ఎకరాల భూములలో ఉన్న ఆక్రమణలను తొలగించాలని, ఇందుకు సంబంధించి ఏదేని కోర్టుల్లో కేసులు ఉన్న వాటికి వెంటనే స్టే వెకేషన్ కొరకు కౌంటర్ దాఖలు చేయాలని దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు జిల్లాలో మొత్తంగా మొత్తంగా ఉన్న 9761 ఎకరాలకు గాను గత సెప్టెంబర్ మాసంలో నిర్వహించిన సమావేశం నాటికి 4866 ఎకరాల భూములు 1బి అడంగల్ నందు దేవాలయ పేర్లు నమోదు కావడం జరిగింది. ప్రస్తుతం 5500 ఎకరాలకు సంబంధించి వన్ బి లో పేర్లు నమోదు కావడం జరిగిందన్నారు.

ఇంకను దాదాపు 2200 పైబడిన భూములకు వెంటనే వన్ బి అడంగల్ నందు సంబంధిత దేవాలయ పేర్లు నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని రెవిన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. ఆలయాల భూములు పరిరక్షించడానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మొదటి సమావేశం నిర్వహించుచున్నామని డిఆర్ఓ తెలిపారు ఈ కమిటీలు సభ్యులు జిల్లా స్థాయి ఇంటర్‌డిపార్టమెంటల్ కమిటీ సభ్యులు :

1. జిల్లా కలెక్టర్–ఛైర్మన్
2. జిల్లా పోలీస్ అధికారి–సభ్యుడు
3. జాయింట్ కలెక్టర్–సభ్యుడు
4. జిల్లా ఎండౌమెంట్స్ అధికారి/ అసిస్టెంట్ కమిషనర్–సభ్య కార్యదర్శి
5. జిల్లా రెవెన్యూ అధికారి–సభ్యుడు
6. సబ్ కలెక్టర్/ఆర్‌డిఓ–సభ్యుడు
7. మునిసిపల్ కమిషనర్లు– సభ్యులు
8. జిల్లా పంచాయతీ అధికారి–సభ్యుడు
9. ఆర్&బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్–సభ్యుడు
10. అసిస్టెంట్ డైరెక్టర్ (ల్యాండ్ రికార్డ్స్)–సభ్యుడు
11. జిల్లా రిజిస్ట్రార్–సభ్యుడు

డిఆర్ఓ మాట్లాడుతూ కొన్నిచోట్ల దేవాలయ భూములను తక్కువ ధరకు వేలంలో లీజుకి ఇస్తున్నట్లు దృష్టికి వచ్చిందన్నారు. సరైన ధరకు వేలం నిర్వహించి భూములను లీజుకు ఇవ్వాలని ఈవో లను ఆదేశించారు. వివాదాస్పద భూములన్నింటిని సర్వే చెయ్యాలని సూచించారు.

జాయింట్ సర్వే పెండింగ్ ఉన్న వాటిని ఆయా శాఖలు సమన్వయంతో 30 రోజులు లోపల పూర్తి చేయాలన్నారు. వన్ బి అడంగల్ పేరు మార్పులను 45 రోజులు లోపల చేయాలని రెవిన్యూ శాఖకు సూచించారు. ఆలయానికి ఆదాయం పెంచాలని, ప్రతి దేవాలయం భూమిని వేలంలో లీజుకు ఇవ్వాలన్నారు. భూములను గుర్తించిన పిదప వాటిని లీజుకు ఇవ్వడం ద్వారా దేవాలయ ఆర్థిక స్థితి మెరుగు మెరుగుపడుతుందని తెలిపారు. ప్రతి నెల సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ కమిషనర్ చిట్టెమ్మ సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయ భూములను పరిరక్షించాలి

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి



**అనంతపురం, పెన్ పవర్ జూలై 11 :** జిల్లాలో దేవాలయాల భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా స్థాయి ల్యాండ్ ప్రొటెక్షన్ కమిటీ మీటింగ్ ను జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలసి జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 2,903 ఎకరాల వరకు దేవాలయ భూములు ఆక్రమణలకు గురి కావడం జరిగిందని, వాటిని ఆక్రమణల నుంచి తొలగించి పరిరక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో దేవాదాయ శాఖ భూములు ఎన్ని ఉన్నాయి, అవి సాగులో ఉన్నాయా లేదా, ఎంత భూమి సాగులో ఉంది అనేది చూసుకొని, అన్ని భూములను సాగులోకి తీసుకురావాలన్నారు. దేవాలయాల భూములనుంచే దేవాలయానికి ధూప, దీప, నైవేద్యానికి అవసరమైన నిధులు సమకూరడం జరుగుతుందన్నారు. దేవాలయాల భూములను మండల ఇంచార్జిల ద్వారా కౌలుకు ఇచ్చేలా చూసి వాటిని సాగులోకి తీసుకురావాలని, భూములను సాగు చేసే కౌలు రైతులకు సిసిఆర్సి కార్డులు ఇవ్వాలన్నారు. జాతీయ రహదారులకు సంబంధించి దేవాలయాల భూములను భూసేకరణ చేయగా, వాటికి సంబంధించిన పెండింగ్లో గల నష్టపరిహారం వచ్చేందుకోసం చర్యలు చేపట్టాలన్నారు. అన్ని దేవాలయాల భూములను లీజుకి ఇచ్చేలా చూడాలని, అందులో నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరెడ్డి, డిఆర్ఓ ఏ.మాలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, ఎండోమెంట్ గుంతకల్ ఈవో మఠం మల్లికార్జున, కసాపురం ఏఈఓ, ఈవోలు, ఇన్స్పెక్టర్లు, మున్సిపల్ కమిషనర్ లు, తహసీల్దార్ లు, తదితరులు పాల్గొన్నారు.

### వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని

# వ్యాధులు ప్రబలకుండా చర్యలు

### జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు, పెన్ పవర్ జూలై 11 :** జిల్లాలో జెడ్పి మరియు 15 వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా మంజూరు అనే పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని పిఆర్, ఆర్ డబ్ల్యు ఎస్ అధికారులను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా సచివాల యంలోని సమావేశ మందిరం నుండి జిల్లాలో జెడ్పి మరియు 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా చేపట్టిన పనుల పురోగతిపై ఎంపీడీవోలు ఆర్డబ్ల్యూఎస్ మరియు పంచాయతీ సెక్రెటరీ తో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 31 మండలాల్లో జడ్పీ మరియు 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి త్రాగునీరు, సిమెంట్ రోడ్స్, మురుగునీటి కాలువలకు సంబంధించిపనులనుమంజూరు చేయడం జరిగిందని, పురో గతిలో ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. నిధులు మంజూరై ప్రారంభం గాని పనులను రద్దు చేయాలని తెలిపారు. పూర్తి అయినపనులకు సంబంధించి బిల్లులను వెంటనే అప్లోడ్ చేయాలన్నారు. త్రాగునీరు, డ్రైన్స్ కు సంబంధించి రూ.5 లక్షల లోపు పనులను 15 రోజులలో పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీలలో గ్రామసభల ద్వారా గుర్తించి ఆమోదించిన పంపిన ప్రతిపాదనలకు నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి నెలకు ఒకసారి ఓవర్ హెడ్ ట్యాంకులను పరిశుభ్రం చేయాలని, కుళాయిల ద్వారా నాణ్యమైన తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ఇంటింటి చెత్త సేకరణ సమర్థవంతంగా చేయాలని, సేకరించిన చెత్తను ప్రాసెస్ చేయాలని ఆదేశించారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని పంచాయతీ సెక్రెటరీ, ఏఈలను సమన్వయం చేసుకొని వ్యాధులు ప్రబలకుండా ఎంపీడీవోలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రణాళిక బద్ధంగా ఓవర్ హెడ్ ట్యాంక్స్ ను శుభ్రం చేయాలని, పంపుసెట్లు, బోర్వెల్స్ దగ్గర బహిరంగ మలమూత్ర విసర్జన జరగకుండా చర్యలు చేపట్టాలని, త్రాగునీటి పైపులల్లోకి మురుగునీరు కలవకుండా అవసరమైన చోట్ల మరమ్మత్తులు చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు జడ్పీ సీఈఓ రవికుమార్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ ఈ విజయ్ కుమార్, పంచాయతీరాజ్ ఎస్ ఈ చంద్ర శేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మధ్యవర్తిత్వంపై వన్ కే ర్యాలీ





**కర్నూలు పెన్ పవర్ జూలై 11 :** సుప్రీం కోర్ట్ మధ్యవర్తిత్వ విభాగం సూచనల మేరకు రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్థి గారి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్ మరియు కర్నూలు బార్ అసోసియేషన్ ప్రసిడెంట్ హరినాథ్ చౌదరి శుక్రవారం మధ్యవర్తిత్వం పై వన్ కే ర్యాలీని జండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ కర్నూలు న్యాయ సేవా సదన్ జిల్లా కోర్ట్ ప్రాంగణం నుండి కొండారెడ్డి బురుజు వరకు సాగింది. జడ్జి గారు మాట్లాడుతు ప్రజలకు మీడియేషన్ వలన కలిగే లాభాలు అలాగే మీడియేషన్ ఉపయోగించి కేసులను త్వరగా ఎలా పరిష్కరించుతారో తెలియజేశారు. ఈ మీడియేషన్ ను ఉపయోగించుకుని ప్రజలు తమ కేసులను త్వరగా పరిష్కరించుకోవడానికి వీలవుతుందని తెలిపారు. ఈ ర్యాలీ లో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్, కర్నూలు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హరినాథ్ చౌదరి, శిక్షణ పొందిన మీడియేషన్ న్యాయవాదులు నాగశేషయ్య, యూ. వి. లక్ష్మి, ఎస్సీ ఎస్టీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై. శ్రీహరి న్యాయవాదులు, ట్రైని న్యాయవాదులు, ప్యారా లీగల్ వాలంటీర్స్ మరియు పోలీసులు పాల్గొన్నారు.

# చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దుతాం

**స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్**





**కర్నూలు పెన్ పవర్ జూలై 11 :** కర్నూలు నగరంలో అనేక మార్పు చేర్పులకు శ్రీకారం చుట్టి చెత్తా రహిత నగరంగా తీర్చిదిద్దుతామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. శుక్రవారం ఆయన నగరంలోని గార్గేయపురం, జొహరపురం ప్రాంతాల్లో డంప్ యార్డులను పరిశీలించారు. అనంతరం నగరపాలక కార్యాలయంలో కమిషనర్ పి.విశ్వనాథతో కలిసి మున్సిపల్ అధికారులతో సమావేశమయ్యారు. తర్వాత విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పట్టాభి మాట్లాడుతూ.. కర్నూలును చెత్తా రహిత నగరంగా తీర్చిదిద్దుతున్నామని, ఆ దిశగా పలు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చెత్తా సేకరణకు 91 ఎలక్ట్రిక్ వాహనాలను టెండర్ పిలిచామని, రెండు మూడు నెలల్లో నగరానికి వస్తాయన్నారు. జొహరపురం, గార్గేయపురం డంప్ యార్డుల్లో లెగసి, సాలిడ్ వెస్టేజ్ మేనేజ్మెంట్ ప్లాంట్లను పరిశీలించి, అధికారులకు తగు సూచనలు చేసినట్లు పేర్కొన్నారు. జోహరపురం డంప్ యార్డులో చెత్త నుండి 15 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గార్బేజ్ ట్రాన్సపోర్ట్ సిస్టం (జిటియస్) త్వరలో తీసుకోరాబోతున్నామని, అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. దానికోసం రెండు వాహనాలు మంజూరు చేస్తున్నామని, తద్వారా చెత్తా సేకరణ వాహనాల ప్రయాణం తగ్గించవచ్చని తెలిపారు. నగరంలో నుండి 200-220 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుందని, కర్నూలుతో పాటు పరిసర పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చెత్తా నిల్వ లేకుండా వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ నిర్మాణానికి టెండర్ పిలవడం జరుగుతుందన్నారు. వేస్టేజ్‌తో వచ్చే సంవత్సరం 4 లక్షల టన్నుల ఎరువులను తయారు చేసి 50 మార్కెటింగ్ సంస్థల ద్వారా రైతులకు పంపిణీ చేస్తామన్నారు. వేస్ట్ ఫ్యాకల్టీ, వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ల నిర్మాణ ప్లాంట్లను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కర్నూల్ నగరం స్వచ్ఛ సర్వేక్షన్లో మంచి ర్యాంకు సాధించాలని ఆకాంక్షించారు. నూతనంగా తీసుకొచ్చే ఎలక్ట్రిక్ వాహనాల్లో క్లాప్ ఆటో డ్రైవర్లకు ప్రాధాన్యతను ఇస్తామన్నారు. గతంలో జరిగిన అవకతవకలు, అవినీతిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, ఇంచార్జి ఎస్ఈ శేషసాయి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కమలాపురం మండలం చదిపి రాళ్ల.. గ్రామానికి చెందిన వ్యక్తి కనిపించడం లేదు



ఈయన పేరు పూల సుబ్బ రాయుడు... వయసు 60 సంవత్సరములు.. కమలాపురం మండలం చదిపి రాళ్ల.. గత కొన్ని రోజుల నుండి కనపడటం లేదు.. మీకు ఎక్కడైనా ఆచూకీ తెలిస్తే.. సెల్ : 7780508902కు సమాచారం ఇవ్వగలరు.

# ప్రపంచానికి భారతదేశం అందించిన గొప్ప వరం యోగ

**చిత్తూరులో 5వ రాష్ట్ర స్థాయి న్యాయమూర్తుల శిక్షణ....యోగలో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు**

**యోగాతో ఆరోగ్యాన్ని ఆధ్యాత్మికతను ప్రశాంతమైన జీవనాన్ని పొందండి : చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్**





చిత్తూరు, పెన్ పవర్ జూలై 11 : ప్రపంచానికి భారతదేశం అందించిన గొప్ప వరం యోగ అని, ప్రతి వ్యక్తికి యోగా నిత్యజీవితంలో ఒక భాగం కావాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పివికేఎన్ ప్రభుత్వ కాలేజ్ నందు నిర్వహించిన 5వ రాష్ట్ర స్థాయి న్యాయమూర్తుల శిక్షణ తరగతులకు చిత్తూరు ఎంపీ, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ యోగా ప్రజల నిత్యజీవితంలో ఒక భాగం కావాలని, ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనం గడపడానికి దైనందన జీవితంలో యోగా సాధన నిరంతర ప్రక్రియగా ఉండాలని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమాలను గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు విజయవంతంగా నిర్వహించినందుకు ప్రతి ఒక్క అధికారికి అభినందనలు తెలిపారు. అధికారులు మరియు సిబ్బంది కృషి వల్లనే యోగా కార్యక్రమాన్ని నిర్వహించామని ప్రతిరోజు యోగా తప్పకుండా పాటిస్తే ఆరోగ్యం ఎంతో బాగుంటుందని తెలిపారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యాన్ని ఆధ్యాత్మికతను ప్రశాంతమైన జీవనాన్ని గడపగలమని తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని ఈ అవకాశాన్ని ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

18 గంటలు మన కోసం పనిచేస్తున్న వ్యక్తి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని తెలిపారు. యోగా ను నెల రోజుల కార్యక్రమంగా కాకుండా నిరంతర జీవన విధానంగా భావించి సాధన చేయాలని, యోగా ద్వారా ప్రజల మానసిక, శారీరక ధృడత్వం మెరుగుపడుతుందన్నారు. శ్వాస మీద ధ్యాస నిలిపి ప్రతి రోజు యోగా చేయండి.. సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందండని జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ ఎస్.అముద, చూడ చైర్మన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, టిడిపి నాయకులు, స్థానిక అధికారులు, పివికెఎన్ ప్రిన్సిపాల్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# చెర్లోపల్లి గ్రామంలో "సుపరిపాలనలో తొలి అడుగు"లో మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి





**బనగానపల్లి పెన్ పవర్ జూలై 11 :** బనగానపల్లి నియోజకవర్గం అవుకు మండలం చెర్లోపల్లి గ్రామంలో "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నేడు చెర్లోపల్లి గ్రామానికి విచ్చేసిన మంత్రికి ఘనస్వాగతం పలికిన గ్రామ ప్రజలు, స్థానిక కూటమి నేతలు, కార్యకర్తలు. చెర్లోపల్లి గ్రామంలో రూ. 40 లక్షలతో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్డును మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి ప్రారంభించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో తొలి ఏడాది విజయవంతంగా పూర్తి చేసిన నేపథ్యంలో "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమంలో భాగంగా నేడు చెర్లోపల్లి గ్రామంలో నేటి సాయంత్రం నుంచి రాత్రి వరకు ఇంటింటికీ తిరిగి గతేడాది కాలంలో కూటమి ప్రభుత్వం అందించిన అభివృద్ధి-సంక్షేమంతో కూడిన సుపరిపాలన గురించి ప్రజలకు వివరించి, కరపత్రాలను మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి, ఆర్థిక ఇబ్బందులున్నా... సూపర్ సిక్స్‌లో భాగంగా అన్ని పథకాలను అమలు చేస్తున్నట్లు ప్రజలకు మంత్రి తెలియజేశారు.

# స్వర్ణాంధ్ర పి4 ఫౌండేషన్ ద్వారా పేద కుటుంబాలకు ఆసరా

**మార్గదర్శిగా ముందుకు వచ్చిన సుశీల నేత్రాలయ వైద్యశాల కంటి వైద్య నిపుణులు డా.సుధాకర్ రావు**

**జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**





**కర్నూలు, పెన్ పవర్ జూలై 11 :** స్వర్ణాంధ్ర పి4 ఫౌండేషన్ ద్వారా పేద కుటుంబాలను ఆదుకోవడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో స్వర్ణాంధ్ర పి4 ఫౌండేషన్- మార్గదర్శి - బంగారు కుటుంబం కింద గోనెగండ్ల నివాసి బోయ కౌలుట్లయ్య అనే రైతు కుటుంబానికి కలెక్టర్ రూ.2 లక్షల చెక్‌ను అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదల బతుకుల్లో వెలుగు నింపేలా స్వర్ణాంధ్ర పి4 ఫౌండేషన్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. గోనెగండ్లకు చెందిన బోయ కౌలుట్లయ్య పేదరికం వల్ల ఇబ్బందులు పడుతుండడంతో బంగారు కుటుంబంగా గుర్తించి మార్గదర్శిగా ముందుకు వచ్చిన సుశీల నేత్రాలయ వైద్యశాల కంటి వైద్య నిపుణులు డా.సుధాకర్ రావు ద్వారా ఆర్థిక సాయం చేయడం జరిగిందన్నారు.. 2 లక్షల రూపాయల డబ్బుతో పాడి గేదెలను కొనుగోలు చేసి జీవన ఉపాధి కల్పించుకోవాలని కలెక్టర్ కౌలుట్లయ్యకు సూచించారు.. మంచి పాడి గేదెలను చూసి ఇప్పించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పశుసంవర్ధక శాఖ అధికారిని ఆదేశించారు.. మిగిలిన డబ్బుతో ఏవైనా లోన్‌లు ఉంటే తీర్చేసుకుని వ్యవసాయం చేసుకోవాలని కలెక్టర్ రైతుకు తెలిపారు. బంగారు కుటుంబంగా గుర్తించిన కౌలుట్లయ్య కుటుంబానికి మార్గదర్శిగా సుశీల నేత్రాలయ వైద్యశాల కంటి వైద్య నిపుణులు డా.సుధాకర్ రావు రూ.2 లక్షలు అందించడం అభినందనీయమని కలెక్టర్ డా.సుధాకర్ రావుని అభినందించారు..అవకాశమున్న వారు ఈ విధంగా ముందుకు వచ్చి బంగారు కుటుంబాలకు ఆసరాగా నిలవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఆర్థిక సాయమే చేయనక్కర్లేదని, బంగారు కుటుంబాలకు మెంటార్ గా విద్యా, ఉపాధి తదితర అంశాల్లో గైడెన్స్ ఇచ్చి వారికి తగిన సహకారం అందించవచ్చని కలెక్టర్ సూచించారు. పారిశ్రామికవేత్తలు, వ్యాపారులే కాకుండా ఉద్యోగులు కూడా ముందుకు రావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.. పీ-4ను జయప్రదం చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన, ఆర్థికంగా అభివృద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్ నిర్మాణం సాధ్యమవుతందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సుశీల నేత్రాలయ వైద్యశాల కంటి నిపుణుడు డా.సుధాకర్ రావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.

# మధ్యవర్తిత్వం వారోత్సవాలు






**కర్నూలు పెన్ పవర్ జూలై 11 :** సుప్రీం కోర్ట్ మధ్యవర్తిత్వ విభాగం సూచనల మేరకు రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్థి గారి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి శుక్రవారం కర్నూలు బార్ అసోసియేషన్ నందు న్యాయవాదులకు మధ్యవర్తిత్వం ద్వారా కేసులను ఎలా పరిష్కరించాలో అనే దానిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ ఈ నెల 10వ తేది నుండి 16 వ తేది వరకు ఉమ్మడి జిల్లా లలో మధ్యవర్తిత్వంపై అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. రెండవ రోజు భాగంగా కర్నూలు బార్ అసోసియేషన్ నందు న్యాయవాదులకు మీడియేషన్ వలన కలిగే లాభాలు అలాగే మీడియేషన్ ఉపయోగించి కేసులను త్వరగా ఎలా పరిష్కరించుతారో తెలియజేశారు. ఈ మీడియేషన్ ప్రక్రియ లో న్యాయవాదుల సహాయ సహకారాలు ఉంటే కేసులు ఎక్కువగా పరిష్కారమైతాయని తెలిపారు. ఈ సమావేశంలో కర్నూలు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హరినాథ్ చౌదరి, సెక్రటరీ వెంకటేశ్వర్లు మరియు హైకోర్టు బార్ అసోసియేషన్ మెంబర్ రవి గువేరా, మీడియేషన్ శిక్షణ పొందిన న్యాయవాదులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

# మన జీవితంలోని రోజువారీ నిర్ణయాలు ఎవరు తీసుకుంటారు

**- మన హృదయమా, మనస్సా లేదా ఇతరులా?**

**- పవర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి**



**కడప పెన్ పవర్ జూలై 11 :** ఖాళీ (వ్రాయని) పలక నస్రుద్దీన్ హొజా తన స్వగ్రామం వదిలి, నగరంలో నివసించడానికి తన కుటుంబంతో సహా వెళ్లాడు. జీవనోపాధి కోసం ఒక మిఠాయి దుకాణం తెరిచాడు. జనాలను ఆకర్షించడానికి, దుకాణం ముందు ఒక పలకను వ్రేలాడదీశాడు, దానిపై ఇలా వ్రాసాడు: " ఇక్కడ తాజా మిఠాయిలు అమ్మబడును." తరువాత దుకాణం వద్ద కూర్చొని, మిఠాయిలు కొనుగోలు చేయడానికి ఎవరైనా వస్తారని వేచి చూస్తున్నాడు. అటుగా వెళ్తున్న ఒక బాటసారి దుకాణం దగ్గర ఆగి, "తాజా" అని ఎందుకు వ్రాశావు? పాచిపోయిన మిఠాయిలు ఎవరూ అమ్మరు కదా?" అన్నాడు. హొజా అతనికి కృతజ్ఞతలు తెలుపుతూ, పలకపై 'తాజా' అన్న పదాన్ని చెరిపేసాడు. ఇప్పుడు ఆ పలక మీద "ఇక్కడ మిఠాయిలు అమ్మబడును" అని మాత్రం వ్రాసి ఉంది. అదే రోజు, మరొక వ్యక్తి దుకాణానికి వచ్చి, వ్రేలాడుతున్న పలక వైపు చూసి, తల అడ్డంగా ఊపుతూ హొజాతో ఇలా అన్నాడు, "ఇదిగో, 'ఇక్కడ' అని వ్రాయడం అవసరమా? మిఠాయిలు చూడగానే ఎవరికైనా ఇక్కడే మిఠాయిలు అమ్ముతున్నారని అర్థం అవుతుంది కదా", అన్నాడు. హొజా అతనికి కూడా కృతజ్ఞతలు తెలుపుతూ , 'ఇక్కడ' అనే పదాన్ని చెరిపివేసాడు. ఇప్పుడు పలక మీద " మిఠాయిలు అమ్మబడును" అని మాత్రమే ఉంది. కొంతసేపటికి ఆ నగరంలో ఒక పాఠశాల ఉపాధ్యాయుడు దుకాణానికి వచ్చాడు. అతను పలక వైపు చూసి, "అమ్మబడునా? ఖచ్చితంగా, మీరు మిఠాయిలు అమ్మడానికే తెచ్చారు కదా, మీరు మిఠాయిలు దానం చెయ్యట్లేదు కదా! అన్నాడు." హొజా అతనికి మళ్ళీ కృతజ్ఞతలు తెలుపుతూ 'అమ్మబడును' అనే పదాన్ని చెరిపేసాడు. ఇప్పుడు పలక మీద "మిఠాయిలు" అని మాత్రమే వ్రాసి ఉంది. మళ్ళీ ఓపికగా మిఠాయిలు కొనేవారు ఎవరైనా వస్తారేమోనని ఎదురుచూడసాగాడు. ఆ నగరంలోనే నివసిస్తున్న ఒక పెద్దాయన అటుగా వచ్చాడు. దుకాణానికి వచ్చి, "దుకాణానికి అరమైలు దూరం నుంచే మిఠాయిల సువాసన రావడం మొదలవుతోంది. మిఠాయిలు అని వ్రాయడం అవసరమా?", అని అన్నాడు. హొజా అతనికి కృతజ్ఞతలు తెలుపుతూ, పలక పై వ్రాసి ఉన్న 'మిఠాయిలు' అనే ఏకైక పదాన్ని కూడా చెరిపేసాడు. ఇప్పుడు అక్కడ పైన ఏమీ వ్రాయని ఖాళీ పలక మాత్రమే వ్రేలాడుతూ ఉంది. హొజా మళ్లీ కొనుగోలుదారుల కోసం ఎదురుచూడడం ప్రారంభించాడు. అప్పుడే అతని భార్య బయటకు వచ్చి,"ఈ పలక ఖాళీగా ఎందుకు వ్రేలాడుతోంది. అందరినీ ఆకర్షించడానికి ఇదేమైనా సరైన మార్గమా?" అని కోపంగా అంటూ, హొజాతో ఇలా అంది, " ఇచ్చట తాజా మిఠాయిలు అమ్మబడును' అని ఎందుకు వ్రాయకూడదు?" అని అడిగింది. ఆ రోజు నస్రుద్దీన్‌కి ఒక విషయం బాగా అర్థమైంది - అందరూ ఒకే విషయాన్ని చూసినా, వారు చూసి, అర్థం చేసుకునే దృష్టికోణం వైవిధ్యంగా ఉంటుంది. మనందరికీ ఒక విషయాన్ని చూడడానికి, అర్థం చేసుకోవడానికి ఒకే రకమైన ఇంద్రియాలు ఉంటాయి, కానీ ప్రతి ఒక్కరూ ఒకే విధంగా చూసి, అర్థం చేసుకోవాలని లేదు. మనం హృదయాన్ని అనుసరించినప్పుడు, దుర్బలమైన సందేహం, గందరగోళానికి బదులుగా విశ్వాసభరితమైన నిర్ణయాలు మాత్రమే ఉంటాయి.

**దాజీజి, హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం**
**అనువాదబృందం ఆంధ్రప్రదేశ్**

# బనగానపల్లె ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి సమీక్ష



**బనగానపల్లి పెన్ పవర్ జులై 11 :** బనగానపల్లె నియోజకవర్గంలో నిర్వహించిన "విద్యాసదస్సు" కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి. బనగానపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పన %-% ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల స్థితిగతులపై "విద్యాసదస్సు" పేరుతో మంత్రి అధ్యక్షతన సమీక్షా సమావేశం. బనగానపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి పాఠశాలలో డ్రికింగ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడమే తొలి ప్రాధాన్యతగా తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతీ గ్రామంలోని, ప్రతి పాఠశాలను ప్రత్యేకంగా తనిఖీ చేసి, అక్కడ నీటి వనరులకు ఉన్న అవకాశాలు, అక్కడ వాటర్ ప్లాంట్ ఏర్పాటు ఎంత ఖర్చు అవుతుంది వంటి అంశాలపై స్థానిక ప్రాధానోపాధ్యాయుడు, ఆర్ డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి పూర్తి వివరాలతో సమగ్ర నివేదికను రూపొందించి, 10 రోజుల్లో తనకు అందించాలని మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి ఆదేశించారు. నాడు -నేడు కార్యక్రమంలో భాగంగా గతంలో పనులు ప్రారంభించి, ఆతర్వాత నిధులు లేక నిలిపివేయబడ్డ అభివృద్ధి పనుల ప్రస్తుత స్థితిపై మండల విద్యా శాఖ అధికారులు, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులను వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. నాడు హడావుడిగా కేవలం ప్రచారం కోసం పనులు ప్రారంభించబడి, నేడు నిరుపయోగంగా పడి ఉన్న నిర్మాణాలను ఉపయోగించుకునే వెసులుబాటు, వాటిని పూర్తి చేయడానికి ఎంత మేరకు నిధులు కేటాయించాలనే వివరాలను మంత్రి కోరారు. బనగానపల్లె నియోజకవర్గంలోని మొత్తం 261 స్కూళ్లకు సంబంధించిన సమస్యలను 3 విభాగాలుగా విభజించాలని అధికారులకు మంత్రి సూచించారు. 3 విభాగాల్లో తొలి ప్రాధాన్యతగా రూ. 50 వేలు నిధులు ఖర్చు చేస్తే పూర్తయ్యే సమస్యలు.. 2 వ ప్రాధాన్యతగా ఏ స్కూళ్లో ఎన్ని అదనపు తరగతుల కావాలనే వివరాలపై నివేదిక... 3 వ ప్రాధాన్యతగా నాడు-నేడు కింద పనులు మొదలు పెట్టి అర్ధాంతరంగా ఆగిపోయిన అభివృద్ధి పనుల వివరాలపై నివేదిక అందించాలని మంత్రి ఆదేశించారు. ఈ 3 కేటగిరీల వివరాలను సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నుంచి వివరాలను సేకరించి, సమగ్ర సమాచారంతో నివేదికను అందించాలని ఎంఈవోలను మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కారస్తామని హామీ ఇచ్చిన మంత్రి.. మరికొన్ని విధానపరమయిన విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని మంత్రి తెలిపారు. ప్రధానంగా పాఠశాలల్లో కాంఫౌండ్ వాల్, డ్రింకింగ్ వాటర్ ప్లాంట్, టాయిలెట్లు, ఎలక్ట్రిక్ సమస్యలు, నాడు-నేడులో పనులు ప్రారంభించినప్పటికీ గదులకు డోర్లు, పెయింట్‌లు వంటి అర్ధాంతరంగా వదిలేసిన సమస్యలు మంత్రి దృష్టికి తీసుకురాగా.. దశల వారీగా పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలోనే తొలిసారిగా బనగానపల్లె నియోజకవర్గంలో పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యాసదస్సు నిర్వహించడంపై సంతోషం వ్యక్తం చేస్తూ, మంత్రికి ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీఈవో, బనగానపల్లె నియోజకవర్గంలోని ఎంఈవోలు, ప్రాధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## అడిషనల్ కమిషనర్ రాకేష్ చేతుల మీదుగా

# పెన్ పవర్ నూతన కార్యాలయం ప్రారంభం



### సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి, ఇక్బాల్ బాషా, కేశవ్









**కడప పెన్ పవర్ జూలై 10 :** కడప కడప నగరంలో గాంధీనగర్ స్కూల్ ఎదురుగా హౌసింగ్ బోర్డ్ కాలనీలో పెన్ పవర్ నూతన కార్యాలయాన్ని కడప నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ రాకేష్, ప్రముఖ అడ్వకేట్, ప్రభుత్వ పి పి, కొమ్మినేని వేణుగోపాల్, మైనారిటీ నాయకుడు సయ్యద్ ఇక్బాల్ బాషా కలసి ఉదయం ఎనిమిది గంటలకు గురు పౌర్ణమి రోజున ప్రారంభించారు. అడిషనల్ కమిషనర్ కార్యాలయంలో జరిగే సేవలను, కార్యకలాపాలను గురించి, బ్యాంకింగ్ సేవలు గురించి, జీవీ కేశవ్ బాబును అడిగి తెలుసుకున్నారు. సయ్యద్ ఇక్బాల్ బాషా మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వ ఉద్యోగులకు, అందరికీ కార్యాలయంలో ప్రారంభించిన హెల్త్ ఇన్సూరెన్స్ సేవలను, బ్యాంకింగ్ సేవలు గురించి తెలియజేశారు. పెన్ పవర్ పత్రికను రాయలసీమలోని, ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాలలో జరిగేటటువంటి మంచి విషయాలను మన పత్రిక పెన్ పవర్ దాదాపు 8 నెలల నుండి నేను రెగ్యులర్ గా చూస్తున్నాను అని అడిషనల్ కమిషనర్ రాకేష్ కొనియాడుతూ, పెన్ పవర్ న్యూస్ క్వాలిటీ, సూపర్‌గా, పెన్ యొక్క పవర్ను ఉన్నది ఉన్నట్లుగా , ప్రశ్నించే తత్వం కలిగిన సమ్మిరెడ్డి కృష్ణారెడ్డిని ఉన్నత స్థాయికి చేరుకోవాలని శుభాకాంక్షలు తెలియజేశారు. తదనంతరం ప్రముఖ అడ్వకేట్ కొమ్మినేని వేణుగోపాల్, మైనారిటీ నాయకుడు సయ్యద్ ఇక్బాల్ బాషా , జీవి కేశవ్, ఇలియాస్ ,కారుణ్య డైరెక్టర్ అనూష తదితరులు మా ఆహ్వానాన్ని మన్నించి అప్పటికప్పుడే ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నందుకు ధన్యవాదాలు తెలియజేశారు. చిరు కానుకగా శాలువాతో, మెమొంటో అందజేసి సత్కరించి మా మిత్రులు శ్రేయోభిలాషులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు అడిషనల్ కమిషనర్ రాకేష్ కు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. అనంతరం స్నేహం ఫౌండేషన్ సేవా ట్రస్ట్ డైరెక్టర్ లక్ష్మీ ప్రసన్న, మిత్రులు శ్రేయోభిలాషులు అనేకమంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.







# వివిధ శాఖల పనితీరుపై ప్రజల నుంచి ప్రతికూల ఆరోపణలు

## - ఒకే అంశానికి చెందిన ఫిర్యాదులు పదే పదే వస్తున్నాయి - జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, జూలై 11 :** వివిధ శాఖల పనితీరు, సంక్షేమ పథకాల అమలు చేస్తున్న తీరుపై ప్రజల నుంచి ప్రతికూల ఆరోపణలు నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం అమరావతి నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయానంద్ జిల్లా కలెక్టర్లతో పి4, ప్రజాభిప్రాయం, హాస్పిటల్ సేవలు, సీజనల్ వ్యాధులు, వసతి గృహాల నిర్వహణ, మరమ్మత్తులు, టాయిలెట్స్ నిర్మాణాలు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు, ఇతర జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ పి.ప్రశాంతి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ఒకే అంశానికి చెందిన ఫిర్యాదులు పదే పదే చేస్తున్నారని, అటువంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు.

క్షేత్ర స్థాయిలో వాస్తవంగా ఫిర్యాదు చేసిన వారిని కలిసి సమస్య తెలుసుకో గలిగితే కాని వాటికి సహేతుకమైన కారణాలు తెలియవని పేర్కొన్నారు. పి4 సర్వే ప్రక్రియ ప్రకారం జూలై 17 నుంచి ఆగస్టు 10 వ తేదీ వరకు సేకరించిన డేటా ఆధారంగా మార్గదర్శులతో, లబ్ధిదార బంగారు కుటుంబాలతో మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు. మార్గదర్శుల ద్వారా బంగారు కుటుంబాలలో వారికి మెరుగైన జీవన ప్రయోజనాలను, వ్యక్తిగత ఆరోగ్య స్థితిగతులు మెరుగైయ్యే విధంగా చర్యలు తీసుకోవడం ముఖ్యం అన్నారు. ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం ప్రత్యేక నైపుణ్య పెంపు విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ విషయంకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న విషయం విదితమే అన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గ్రామ పంచాయతీలలో శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని, మూడోవ శనివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించడంపై దృష్టి పెట్టాల్సి ఉంటుందన్నారు.

జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బిసి సంక్షేమ వసతి గృహాలలో టాయిలెట్స్ నిర్మాణం కోసం 200 పనులు చేపట్టవలసి ఉందన్నారు. వాటిని త్వరిత గతిన చేయడానికి అనుగుణంగా వివరాలను ఆర్‌డబ్ల్యుఎస్ వెబ్సైట్‌లో అప్లోడ్ చెయ్యాలని పేర్కొన్నారు. సంక్షేమ వసతి గృహాలలో తహసీల్దార్ లు తనిఖీలు నిర్వహించి, నివేదిక అందచేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ పి హెచ్ సి పరిధిలో అందుతున్న వైద్య సేవలు, మందులు వినియోగంతో పాటు శానిటేషన్, పరిసరాల పరిశుభ్రత నిర్వహణ వివరాలు ఆన్లైన్ లో అప్లోడ్ చెయ్యాలని పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధుల దృష్ట్యా రానున్న 4 లేదా 5 నెలలు అత్యంత ప్రాధాన్యత కలిగిన సమయం అన్నారు. వైద్య పరీక్షలు నిర్వహణ, ఇతర అనుబంధ కార్యకలాపాలు నిర్వహించే క్రమంలో వాటి వివరాలు జియో ట్యాగింగ్ చేసి, అప్లోడ్ చెయ్యాలని పేర్కొన్నారు. ప్రస్తుత రబీ సీజన్లో విత్తనాల పంపిణీ కోసం ఎటువంటి ఇబ్బందులు లేకుండా క్షేత్ర స్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు, సిపిఓఎల్ అప్పలకొండ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గోదావరి ఉధృతి-గండి పోచమ్మ ఆలయం ముంపులోకి...

### ఆలయ పరిసర రహదారులు నీట మునిగి రాకపోకలకు అంతరాయం.. షాపుల్లోకి ప్రవేశించిన వరద-వ్యాపారులు తహతహ..

### సురక్షిత ప్రాంతాలకు సరుకులు తరలిస్తున్న వ్యాపారులు.. భక్తుల రాకను నిలిపిన అధికారులు-ఆలయ ప్రాంగణంలో ప్రవేశం నిషేధం..



**దేవీపట్నం,పెన్ పవర్, జూలై11 :** గోదావరి పర్యాటన కాదు.. పరవళ్లు తొక్కే ప్రవాహం ఇప్పుడు భక్తుల విశ్వాసాలపై విరుచుకుపడుతోంది.దేవీపట్నం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి పోచమ్మ తల్లి ఆలయం పరిసరాల్లో గోదావరి నీరు పెరిగిపోతూ ఆ స్థలాన్ని పూర్తిగా ముంచేస్తోంది.పెరుగుతున్న వరద ఉధృతి కారణంగా ఆలయ పరిసర రోడ్లు పూర్తిగా మునిగి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.పుణ్యక్షేత్రం దగ్గర ఉన్న అనేక చిన్న పెద్ద షాపుల్లోకి వరద నీరు ప్రవేశించి వ్యాపారులకు కలవరమే కాకుండా ఆస్తినష్టం తెచ్చిపెడుతోంది.తమ దుకాణాల్లో ఉన్న సరుకులను గల్లంతు కాకుండా రక్షించుకునేందుకు వ్యాపారులు హుటాహుటిన సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు.ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని,ఆలయానికి భక్తులు రాకుండా అధికారులు చర్యలు చేపట్టారు.వందలాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచే గండి పోచమ్మ ఆలయం ఏటా ఇలాగే నీటిమునిగే దుస్థితి ఎదుర్కొంటోంది.గత ప్రభుత్వాలు ఆలయ అభివృద్ధిపై పెద్ద పెద్ద హామీలు ఇచ్చినా,అవి మాటలకే పరిమితమయ్యాయి.పనులు ప్రారంభం కావడం తేలిక కాదు,ప్రారంభమవకుండానే ఐదేళ్లు గడిచిపోయాయి.ఇప్పుడు కొత్త ప్రభుత్వం ఉందన్న ఆశతో భక్తులు ఎదురుచూస్తున్నారు.ఈసారి అయినా ఆలయానికి ఎప్పటికీ ముంపు ముప్పు లేకుండా శాశ్వత పరిష్కారం చూపించాలని,తల్లి దర్శనానికి భక్తులకు ఎటువంటి అవరోధం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ఈ గోదావరి ఉధృతి ప్రతి ఏడాది మళ్లీ పునరావృతమవుతోంది.కానీ మారేది మాత్రం వరద స్థాయి మాత్రమే...అధికారుల స్పందన మాత్రం మారడంలేదు అని స్థానికులు వేదన వ్యక్తం చేస్తున్నారు.



# అర్హులందరికి ప్రభుత్వ పథకాలు

### - మాజీ చైర్మన్ ప్రకాష్



**మండపేట. పెన్ పవర్. జూలై 11 :** రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తుందని మండపేట పురపాలక సంఘం మాజీ చైర్మన్ చుండ్రు శ్రీ వర ప్రకాష్ అన్నారు. మండపేట 10,14వార్డు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీ వర ప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డులో ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తి అయిన సందర్భంలో చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. రాబోవు రోజుల్లో చేయబోయే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. వార్డులో ప్రజలకు ఉన్న సమస్యలను అడిగి తెలుసు కున్నారు. వాటిని సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని శ్రీ వర ప్రకాష్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఉంగరాల రాంబాబు, పట్టణ టిడిపి అధ్యక్షులు మచ్చ నాగు,10వ వార్డ్ ప్రెసిడెంట్ సబిటి అనిల్, సిరంగు ఈశ్వర్, శెట్టి రవికుమార్ , సాధనాల చక్రపాణి, పిట్ట రాజబాబు, బడుగు రత్నరాజు, నిమ్మలపూడి వినాయకరావు, నిమ్మలపూడి గణేష్, ముత్యాల మెహర్ సుబ్బారావు, బర్రె దుర్గాప్రసాద్, విజయేంద్ర ప్రసాద్ ,క్లస్టర్ ఇంచార్జ్ బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

### పేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే

# ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం



**మండపేట. పెన్ పవర్ జూలై 11 :** పేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వర రావు అన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం కపిలేశ్వరపురం మండలం, తాతపూడి, కపిలేశ్వర పురం, అంగర, పడమరఖండ్రిక గ్రామాలలో ఇంటింటా పర్యటించారు. ప్రతీ ఇంటిని సందర్శించి ప్రజలతో మాట్లాడి వారి బాగోగులు, వారికి ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాల వివరాలను తెలుసుకున్నారు. చాలా మంది ప్రజలు ఇళ్ల స్థలాల సమస్యను ఎమ్మెల్యేకు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హత గల పేదలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పట్టణంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు ఇళ్ళ స్థలం ఇచ్చే విధంగా చర్యలు చేపట్టనుందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి తీరతామన్నారు. ఇప్పటికే కొన్ని పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. పథకాలు పొందిన లబ్దిదారులు ఎనలేని సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. భవిష్యత్ కాలంలో ప్రతీ ఇంటిలో ఓ ఉద్యోగి ఉండాలన్నది, పేదరికం లేని కుటుంబాలు ఏర్పడాలన్నది రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని పేర్కొన్నారు. డ్వాక్రా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అన్ని విధాలుగా చర్యలు చేపట్టినట్లు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్నది కేవలం అబూత కల్పన ఆరోపణలేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### రైతుసేవా కేంద్రాల్లో "అన్నదాత సుఖీభవ"అర్హుల జాబితాలు

### - మండల వ్యవసాయ అధికారి విశ్వనాథ్



**గంగవరం, పెన్ పవర్, జూలై 11 :** అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాలు రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచడం జరిగింది అని వ్యవసాయ అధికారి కె విశ్వనాథ్ తెలిపారు. అర్హతలు ఉండి, జాబితాలో పేర్లు లేకపోతే,13 వ తారీఖు లోపు రైతు భరోసా కేంద్రాల్లో గ్రీవెన్స్ పెట్టుకోవాలన్నారు.అందుకు రైతు సేవా కేంద్రంలోని అగ్రికల్చర్ అసిస్టెంట్ లను సంప్రదించాలన్నారు. కౌలు చేసుకొనే భూమిలేని గిరిజన రైతులు, కౌలు కార్డుల కొరకు సంబంధిత వీఆర్వో, అగ్రికల్చర్ అసిస్టెంట్ లను సంప్రదించాలన్నారు.

# రెండు కేజీల గంజాయితో వ్యక్తి అరెస్టు



**జగ్గంపేట(గండేపల్లి), పెన్ పవర్, జూలై 11 :** రెండు కేజీల గంజాయితో వ్యక్తిని అరెస్టు చేసినట్లు జగ్గంపేట సీఐ వైఆర్కె శ్రీనివాస్, గండేపల్లి ఎస్ఐ యువి శివనాగబాబు తెలిపారు. దీనికి సంబంధించిన వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట జాతీయరహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా కిర్లంపూడి గ్రామానికి చెందిన టి.రాజశేఖర్ గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. అతని వద్ద నుంచి రెండు కేజీల గంజాయి స్వాధీనం చేసుకొని అరెస్టు చేశా మన్నారు. దీనిపై కేసు నమోదు చేసి పెద్దాపురం కోర్టులో ప్రవేశపెట్టగా 14 రోజుల పాటు రిమాండ్ విధించారని తెలిపారు. ఎవరైనా గంజాయిని తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దీనిపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టామని ఎస్ఐ శివనాగబాబు తెలిపారు.

# గిల్‌కు వన్డే కెప్టెన్సీ.. రోహిత్ శర్మను తప్పించడానికి కారణం ఇదే!



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ లో మరో సంచలన మార్పు బీసీసీఐ తీసుకోబోతున్నట్లు సమాచారం. టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభమాన్ గిల్ ను వన్డేల్లో కూడా సారథ్య బాధ్యతలు అప్పజెప్పనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం టీమిండియా వన్డే కెప్టెన్ గా ఉంటున్న రోహిత్ శర్మ స్థానంలో గిల్ కెప్టెన్సీ బాధ్యతలు తీసుకోనున్నాడు. రిపోర్ట్స్ ప్రకారం గిల్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని ఇద్దరు జర్నలిస్టులు పోస్టా పోస్ట్ చేయడం గురువారం (జూలై 10) సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. టీమిండియా తదుపరి ఆడబోయే వన్డే సిరీస్ కు గిల్ టీమిండియా వన్డే కెప్టెన్ గా ఎంపికయ్యే అవకాశం ఉంది. టీమిండియా తమ తదుపరి వన్డే సిరీస్ ను అక్టోబర్ లో ఆస్ట్రేలియాపై ఆడనుంది. ఈ సిరీస్ నుంచి గిల్ కెప్టెన్ గా బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలుస్తుంది. గిల్ భవిష్యత్ కెప్టెన్ గా కితాబులు అందుకుంటున్నాడు. టీ20 ఫార్మాట్ లోనూ ఈ టెస్ట్ కెప్టెన్ కు వైస్ కెప్టెన్సీ ఇవ్వనున్నట్లు సమాచారం. చివరిసారిగా రోహిత్ శర్మ కెప్టెన్సీలో టీమిండియా 2025 ఛాంపియన్స్ ట్రోఫీ గెలుచుకుంది. ఇప్పటికే టెస్ట్, టీ20 ఫార్మాట్ నుంచి దూరమైన హిట్ మ్యాన్ వన్డేలు మాత్రమే ఆడుతున్నాడు. మూడు ఫార్మాట్ లకు ముగ్గురు కెప్టెన్ లను కొనసాగడం బీసీసీఐ ఆలోచనల్లో లేనట్టు స్పష్టమవుతుంది.

**రోహిత్ తప్పించడానికి కారణం ఇదే!**

రోహిత్ శర్మ ప్రస్తుత వయసు 37 సంవత్సరాలు. 2027 వన్డే వరల్డ్ కప్ వరకు రోహిత్ శర్మ ఆడడం దాదాపుగా ఖాయమైంది. ఫిట్ నెస్ లో హిట్ మ్యాన్ కు సమస్యలు ఉన్నాయి. ఇటీవలే ఐపీఎల్ లో సైతం రోహిత్ ఇంపాక్ట్ ప్లేయర్ గా బరిలోకి దిగాడు. దీంతో పాటు ఇప్పటి నుంచే గిల్ కు కెప్టెన్ గా అవకాశమిస్తే 2027 వరల్డ్ కప్ లోపు అనుభవాన్ని సంపాదించుకుంటాడనే ఆలోచనలో బీసీసీఐ ఉన్నట్టు సమాచారం. భవిష్యత్ దృష్టిలో పెట్టుకొని గిల్ కు టెస్ట్, వన్డే కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

# పంత్ స్థానంలో జురెల్ బ్యాటింగ్ చేయవచ్చా.. ఐసీసీ రూల్స్ ఏం చెబుతున్నాయంటే..?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్ తో జరుగుతున్న లార్డ్స్ టెస్టులో టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ గాయపడ్డాడు. తొలి రోజు ఆటలో భాగంగా చేతి వేలికి గాయమైంది. దీంతో పంత్ గాయం కారణంగా గ్రౌండ్ వదిలి వెళ్ళిపోయాడు. బుమ్రా వేసిన 34 ఓవర్ రెండో డెలివరీ పంత్ ఎడమ చేతి వేలికి బలంగా తగిలింది. నొప్పితో విలవిల్లాడడంతో ఫిజియో వచ్చి స్ప్రేను తన చేతి వేలికి చల్లాడు. నొప్పి తగ్గకపోవడంతో పంత్ గ్రౌండ్ వదిలి వెళ్ళిపోయాడు. పంత్ స్థానంలో ధృవ్ జురెల్ వికెట్ కీపింగ్ చేయడానికి వచ్చాడు. రెండో రోజు పంత్ గాయం నుంచి కోలుకోకపోవడంతో వికెట్ కీపింగ్ చేయడానికి జురెల్ బరిలోకి దిగాడు. పంత్ గాయంపై ఎలాంటి అప్ డేట్ లేదు. రెండో రోజు టీమిండియా బ్యాటింగ్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. పంత్ బ్యాటింగ్ ఆడకపోతే పరిస్థితి ఏంటి అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ పంత్ బ్యాటింగ్ చేయలేకపోతే అతని స్థానంలో వికెట్ కీపింగ్ చేస్తున్న ధృవ్ జురెల్ బ్యాటింగ్ చేయవచ్చా అనే ప్రశ్న ఎదురవుతుంది. ఐసీసీ రూల్స్ ప్రకారం పంత్ బ్యాటింగ్ చేయడానికి రాలేకపోతే అతని స్థానంలో జురెల్ బ్యాటింగ్ చేసే అవకాశం లేదు. ఐసీసీ ప్రస్తుత టెస్ట్ రూల్స్ ప్రకారం, ఒక ఆటగాడు కంకషన్ కు గురైనప్పుడు మాత్రమే ప్రత్యామ్నాయం ఆటగాడిని భర్తీ చేయగలడు. పంత్ గాయం అతని చేతికి సంబంధించింది. తలకు సంబంధించినది కాదు. కాబట్టి జురెల్ ఫీల్డింగ్ ప్రత్యామ్నాయం మాత్రమే. అతను కీపింగ్ చేయడానికి మాత్రమే ఉంటుంది. బ్యాటింగ్ చేయడానికి అర్హత లేదు. ఒకవేళ ఈ మ్యాచ్ లో పంత్ బ్యాటింగ్ కు రాకపోతే టీమిండియాపై ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం కనిపిస్తుంది. సూపర్ ఫామ్ లో ఉన్న పంత్ త్వరగా కోలుకోని బ్యాటింగ్ కు రావాలని టీమిండియా ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. తొలి టెస్టులో రెండు సెంచరీలు కొట్టి అదరగొట్టిన పంత్ రెండో రెండో ఇన్నింగ్స్ లో హాఫ్ సెంచరీ చేసి రాణించాడు.

# దమ్ముంటే తిరుగు.. సెంచరీకి ముందు రూట్‌ను భయపెట్టిన జడేజా




**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియాతో జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లాండ్ తొలి రోజును అద్భుతంగా ముగించింది. లార్డ్స్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్ లో రూట్ అజేయంగా 99 పరుగులు చేసి ఇంగ్లాండ్ ను పటిష్ట స్థితిలో ఉంచాడు. టీమిండియా బౌలర్లను సమర్ధవంతంగా అడ్డుకున్న రూట్.. 191 బంతుల్లో 9 ఫోర్లతో 99 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. తొలి రోజు ఆట ముగుస్తుందనుకున్న సమయంలో రూట్ సెంచరీ చేసే అవకాశం ఉన్నప్పటికీ.. జడేజా కారణంగా 99 పరుగుల వద్ద ఆగిపోయాడు. సరదాగా జడేజా చేసిన ఈ పని సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. తొలి రోజు ఆటలో భాగంగా ఆకాష్ దీప్ తన చివరి ఓవర్ వేశాడు. ఈ ఓవర్ కు ముందు రూట్ 96 తో క్రీజ్ లో ఉన్నాడు. రెండో బంతికీ రెండు పరుగులు తీసుకున్న రూట్ 98 పరుగులకు చేరుకున్నాడు. నాలుగో బంతికి థర్డ్ మ్యాన్ వైపు కొట్టి సింగిల్ పూర్తి చేసుకున్నాడు. రెండో పరుగు తీద్దామా.. వద్దా అనే ఆలోచనలో ఉన్నాడు. ఈ సమయంలో జడేజా బంతిని కింద పడేసి రూట్ వైపుగా చూస్తూ రన్ తిరుగు అని సైగలు చేశాడు. రూట్ తిరగాలనుకున్నప్పటికీ రిస్క్ ఎందుకు అని ఆగిపోయాడు. చివరి రెండు బంతులను స్టోక్స్ డిఫెన్స్ ఆడడంతో పరుగులేమీ రాలేదు. జడేజా చేసిన ఈ చిలిపి పనితో రూట్ తొలి రోజు 99 పరుగుల వద్ద నాటౌట్ గా మిగిలిపోయాడు.తొలి రోజు జరిగిన మ్యాచ్ విషయానికి వస్తే గురువారం మొదలైన మూడో టెస్ట్‌లో ఇంగ్లండ్‌కు శుభారంభం లభించింది. జో రూట్ (191 బాల్స్‌లో 9 ఫోర్లతో 99 బ్యాటింగ్), ఒలీ పోప్ (44) రాణించడంతో.. తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 83 ఓవర్లలో 251/4 స్కోరు చేసింది. రూట్‌తో పాటు బెన్ స్టోక్స్ (39 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. నితీశ్ రెడ్డి రెండు వికెట్లు తీశాడు. బుమ్రా, జడేజాలకు తలో వికెట్ దక్కింది.

# అనుష్క ఫస్ట్ లవ్ అతడే..



మిమీ చక్రవర్తి కొత్త క్యాండిడ్ ఫ్రేమ్ కేవలం విస్మయం కలిగిస్తుంది



వర్షం కురిసినా, నివేదా పేతురాజ్ ఉల్లాసంగా ఉంచుతుంది

టాలీవుడ్‌లో సెన్సిబుల్ పెర్ఫార్మెన్స్, స్ట్రాంగ్ ఫీమేల్ రోల్స్‌తో సత్తా చాటిన నటి అనుష్క శెట్టి. బాహుబలి తర్వాత ఆమె క్రేజ్ దేశవ్యాప్తంగా విస్తరించింది. అంతకుముందే 'అరుంధతి', 'వేదం', 'భాగమతి' వంటి చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అనుష్క.. బాహుబలి తర్వాత తన సినిమాల ఎంపికలో చాలా జాగ్రత్త వహిస్తోంది. కమర్షియల్ సినిమాలకు దూరంగా ఉండి కంటెంట్‌కి ప్రాధాన్యతనిచ్చే కథలే ఎంచుకుంటోంది.

వాస్తవానికి అనుష్క లాంటి స్టార్ హీరోయిన్, క్రేజ్ ఉన్న సమయంలో వరుస సినిమాలు చేయవచ్చు. కానీ ఆమె మాత్రం స్క్రిప్ట్‌కి న్యాయం చేయగల పాత్రలకే ఓకే చెబుతోంది. అందుకే గత కొన్నేళ్లలో ఆమె చేసిన సినిమాల సంఖ్య తక్కువైనా, ప్రతి ప్రాజెక్ట్ ప్రత్యేకంగా నిలిచింది. ఇటీవలే పూర్తయిన 'ఘాటీ' సినిమా కూడా వైవిధ్యభరితమైన కథతో రూపొందినట్లు సమాచారం. ఇది విడుదలకు సిద్ధంగా ఉంది. ఇదిలా ఉండగా, అనుష్క తన వ్యక్తిగత జీవితంలో అరుదుగా స్పందిస్తుంటుంది. అయితే గతంలో ఓ ఇంటర్వ్యూలో తన ఫస్ట్ లవ్ గురించి చెప్పింది. ఇక ఇప్పుడు అది సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. "ఆరో తరగతి చదువుతున్నప్పుడు మా క్లాస్‌లో ఓ బాలుడు వచ్చి నాకు 'ఐ లవ్ యూ' అన్నాడు. అప్పుడు ఆ మాట అర్థం కాకపోయినా, ఏదో కొత్త ఫీలింగ్ కలిగింది. నేనూ సరిగ్గా తెలియకపోయినా 'ఓకే' చెప్పాను. అది చిన్న విషయమే కానీ, ఇప్పటికీ ఆ జ్ఞాపకం మధురంగా మిగిలిపోయింది" అంటూ అనుష్క చెప్పిన ఈ విషయంపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు.

ఈ మాటలతో అనుష్కలోని అమాయకత్వం, నిజాయితీ బయటపడింది. స్టార్ స్టేటస్ ఉన్నప్పటికీ చిన్నప్పటి ప్రేమ జ్ఞాపకాన్ని ఈ విధంగా పంచుకోవడం అభిమానులకు ఆసక్తికరంగా అనిపించింది. "అనుష్క ఎప్పటికీ పాజిటివ్ పర్సనాలిటీ" అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ప్రస్తుతం ఆమె నటించిన 'ఘాటీ' సినిమాపై బాగానే అంచనాలున్నాయి. ఇది ఆమె నటనకు మరో సవాల్‌గా మారనుందని తెలుస్తోంది. గతంలో 'నిశ్శబ్దం'లో మ్యూట్ క్యారెక్టర్‌లో నటించి విమర్శకుల ప్రశంసలు పొందిన అనుష్క, ఈసారి 'ఘాటీ'లో మరో డిఫరెంట్ షేడ్ చూపించబోతున్నట్లు చిత్రబృందం అంటోంది. ఈ సినిమా విడుదల తర్వాత ఆమె తదుపరి ప్రాజెక్ట్‌లు కూడా క్రమంగా ప్రకటించే అవకాశం ఉంది.



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com